



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 22 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తిరుపతి బుధవారం 4 ఫిబ్రవరి 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 22 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : TIRUPATI WED 4 FEBRUARY 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur

## ఇంకా ఎన్నాళ్లీ బఫర్ జోన్లు?
## కేంద్రాన్ని నిలదీసిన అసదుద్దీన్ ఒవైసీ



- చైనా సరిహద్దు అంశంపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఒవైసీ
- 2020కి ముందున్న పెట్రోలింగ్ హక్కులు ఇప్పుడున్నాయా అని నిలదీత
- బఫర్ జోన్లు, చైనా మౌలిక వసతుల నిర్మాణంపై ఆందోళన
- చైనా విషయంలో ప్రభుత్వం భయపడుతోందని ఘాటు విమర్శ
- పార్లమెంటులో చర్చకు అవకాశం ఇవ్వడం లేదని ఆరోపణ

- మిగతా 2లో...

## మణిపూర్ నూతన ముఖ్యమంత్రిగా మార్షల్ ఆర్ట్స్ నిపుణుడు ఖేమ్‌చంద్ సింగ్



- ఢిల్లీలో జరిగిన బీజేపీ శాసనసభాపక్ష సమావేశంలో కీలక నిర్ణయం
- గతేడాది బీరేన్ సింగ్ రాజీనామాతో రాష్ట్రపతి పాలన విధింపు
- ఫిబ్రవరి 12తో ముగియనున్న రాష్ట్రపతి పాలన
- హింస తర్వాత గిరిజన ప్రాంతాల్లో పర్యటించిన తొలి మెయితీ నేతగా గుర్తింపు

- మిగతా 2లో...

# శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి ..
# విచారణ కమిషన్‌కు కేబినెట్ గ్రీన్ సిగ్నల్

- ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ కీలక నిర్ణయం
- సిట్ నివేదిక, ఛార్జ్‌షీట్‌లో తేడాలు ఉన్నట్టు గుర్తింపు
- అసలు వాస్తవాలు తేల్చి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశం



**పెన్ పవర్ డెస్క్:**తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడకం వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఘటనపై లోతైన దర్యాప్తు జరిపి, అసలు వాస్తవాలను వెలికితీసేందుకు ప్రత్యేక విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మంగళవారం నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన అమరావతిలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానించారు.

కల్తీ నెయ్యి వ్యవహారంపై సిట్ సమర్పించిన నివేదిక, కోర్టులో దాఖలు చేసిన ఛార్జ్‌షీట్, ప్రభుత్వానికి అందిన సమాచారం మధ్య తీవ్రమైన తేడాలు ఉన్నట్టు కేబినెట్ గుర్తించింది. సిట్ విచారణలో వెలుగు చూసిన కొన్ని కీలక అంశాలను ఛార్జ్‌షీట్‌లో ఎందుకు చేర్చలేదనే విషయంపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.

ఈ మూడు అంశాల మధ్య ఉన్న వ్యత్యాసాలను పరిశీలించి, అసలు సూత్రధారులను, వాస్తవాలను నిగ్గు తేల్చేందుకే విచారణ కమిషన్ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ కమిషన్ ద్వారా తిరుమల లడ్డూ పవిత్రతపై భక్తుల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయడంతో పాటు, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. విచారణ కమిషన్ నివేదిక అందిన తర్వాత తదుపరి చర్యలు ఉంటాయని కేబినెట్ తెలిపింది.



# లోక్‌సభలో తీవ్ర ఉద్రిక్తత...
## 8 మంది కాంగ్రెస్ ఎంపీల సస్పెన్షన్

- బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు వేటు వేసిన ఇన్చార్జి స్పీకర్
- ఛైర్ వైపు కాగితాలు విసిరి, సభకు అంతరాయం కలిగించారని ఆగ్రహం
- చైనా సరిహద్దు వివాదంపై చర్చకు పట్టుబట్టిన రాహుల్ గాంధీ
- మాజీ ఆర్మీ చీఫ్ నరవణే పుస్తక ప్రస్తావనపై సభలో వాగ్వాదం

**పెన్ పవర్ డెస్క్:**పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో మంగళవారం తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సభలో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి, నిరసన పేరుతో కాగితాలను చింపి స్పీకర్ ఛైర్ వైపు విసిరారన్న కారణంతో 8 మంది కాంగ్రెస్ ఎంపీలను లోక్‌సభ నుంచి సస్పెండ్ చేశారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు ఈ సస్పెన్షన్ అమల్లో ఉంటుందని స్పీకర్ ప్యానెల్ ఆఫ్ చైర్ పర్సన్స్ లో ఒకరైన దిలీప్ సైకియా (ప్యానెల్ స్పీకర్) ప్రకటించారు. సస్పెన్షన్ వేటు పడిన వారిలో అమరీందర్ సింగ్ రాజా వారింగ్, మాణికం ఠాగూర్, గురుజీత్ సింగ్ ఆజులా, హిబి ఈడెన్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రశాంత్ యాదవరావు పడోలే, ఎస్.వెంకటేశన్, డీన్ కురియకోస్ ఉన్నారు. "ప్రతిపక్షాలకు తమ గళం వినిపించే హక్కు ఉంది, కానీ నిరసన పేరుతో సభను పూర్తిగా - మిగతా 2లో...



## అమెరికాతో వాణిజ్య ఒప్పందం..
### వ్యవసాయ ఉత్పత్తులపై కేంద్రం క్లారిటీ

- రైతుల ప్రయోజనాల విషయంలో రాజీ లేదన్న కేంద్ర ప్రభుత్వం
- అమెరికా వ్యవసాయ, పాడి ఉత్పత్తులపై సుంకాలు తగ్గించేందుకు ససేమిరా
- వెనెజువెలా చమురు కొనుగోలు చేస్తామన్న కేంద్రం

- మిగతా 2లో...



## 2029లో రిటర్న్ గిఫ్ట్ ఇస్తాం

- రాష్ట్రంలో ఆటవిక పాలనకు తెరలేపారన్న అనిల్ యాదవ్
- మరో మూడేళ్లు ఆటవిక పాలన భరిస్తామని వ్యాఖ్య
- సీఎం, డిప్యూటీ సీఎం ఫ్రస్ట్రేషన్ లో ఉన్నారన్న అనిల్

- మిగతా 2లో...


## ఢిల్లీ చేరుకున్న నారా లోకేశ్...
## నేడు కేంద్రమంత్రులతో వరుస సమావేశాలు

- రాష్ట్ర అభివృద్ధి, నిధుల సమీకరణే ప్రధాన అజెండా
- అమరావతి, విభజన హామీలపై చర్చించే అవకాశం
- ఐటీ, విద్యా రంగాల విస్తరణపై ప్రత్యేక దృష్టి



**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ ఢిల్లీ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు టీడీపీ ఎంపీలు ఘనస్వాగతం

- మిగతా 2లో...



## పోటీదారులతో పోలిస్తే అమెరికాతో భారత్ మెరుగైన ఒప్పందాన్ని సాధించింది

- అమెరికాతో వాణిజ్య ఒప్పందం ఉజ్వల భవిష్యత్తుకు శుభసూచకమన్న కేంద్రమంత్రి
- ఈ ఒప్పందాన్ని ప్రధాని మోదీ కొలిక్కి తీసుకువచ్చారన్న పీయూష్ గోయల్
- ఒప్పందంపై దేశాన్ని తప్పుదోవ పట్టించేందుకు రాహుల్ గాంధీ ప్రయత్నిస్తున్నారని విమర్శ

**పెన్ పవర్ డెస్క్:** దేశ ప్రయోజనాల విషయంలో రాజీపడకుండా పోటీదారులతో పోలిస్తే భారత్ మెరుగైన ఒప్పందాన్ని సాధించిందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం భారత ఉజ్వల భవిష్యత్తుకు ఒక శుభసూచకమని ఆయన అన్నారు. ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న ఈ ఒప్పందాన్ని ప్రధాని మోదీ కొలిక్కి తీసుకువచ్చారని అన్నారు. ఈ విషయంలో దేశమంతా ఆయనకు అభినందనలు తెలుపుతోందని అన్నారు.

- మిగతా 2లో...



## ఎస్ఎఫ్‌డీఆర్ పరీక్ష విజయవంతం...
### భారత రక్షణ రంగంలో కీలక ముందడుగు

- ఎస్ఎఫ్‌డీఆర్ టెక్నాలజీని విజయవంతంగా పరీక్షించిన డీఆర్‌డీవో
- ఒడిశాలోని చాందీపూర్ తీరంలో జరిగిన ప్రయోగం
- సుదూర గగనతల క్షిపణుల అభివృద్ధికి మార్గం సుగమం
- ఈ టెక్నాలజీతో భారత్‌కు పెరగనున్న వ్యూహాత్మక బలం

- మిగతా 2లో...

## విడదల రజనిపై కేసు నమోదు



- గత నెల 30న యడ్లపాడు దేవస్థానం వద్ద ఉద్రిక్తత
- రజనితో పాటు 21 మంది వైసీపీ నేతలపై దాడి
- శాంతి భద్రతలకు విఘాతం కలిగించారని కేసు

- మిగతా 2లో...

## నెయ్యి కల్తీపై ఏపీ కేబినెట్ సీరియస్..
## మంత్రుల ప్రెస్ మీట్...

- శ్రీవారి నెయ్యి కల్తీపై కేబినెట్ సుదీర్ఘ సమీక్ష
- సీబీఐ నివేదికలోని అంశాలపై మూడున్నర గంటల చర్చ
- గత ప్రభుత్వ హయాంలో భారీ అక్రమాలు జరిగాయన్న మంత్రులు
- దోషులపై చర్యలకు ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటుకు నిర్ణయం
- తిరుమల పవిత్రతను కాపాడటమే లక్ష్యమని స్పష్టం చేసిన ప్రభుత్వం

- మిగతా 2లో...



## ఎడిటర్ వ్యూ

# మాడభూషి జీవితం నేటి తరానికి ఆదర్శం

మాడభూషి అనంత శయనం అయ్యం గార్ ప్రముఖ న్యాయవాది గా, సామాజిక కార్యకర్తగా, స్వాతంత్ర్య సమరయోధుడుగా, అత్యుత్త మ పార్లమెంటు సభ్యుడిగా, వక్తగా, విశిష్ట పండితుడిగా, లోకసభ స్పీకర్‌గా, పాత తరానికి చెందిన జాతీయ నాయకులలో విశిష్ట స్థానం దక్కించు కున్నారు. అయ్యంగార్ 1891 ఫిబ్రవరి 4న ఆంధ్రప్రదేశ్‌లోని ఆధ్యాత్మిక పట్టణం తిరుపతి సమీపంలో తిరుచనూరులో జన్మించారు. తిరుపతి లోని దేవస్థానం ఉన్నత పాఠశాలలో ప్రారంభ విద్యను పూర్తి చేసి, ఉన్నత చదువుల కోసం మద్రాసుకు వెళ్లారు. మద్రాసులోని పచయ్యప్ప కళాశాల నుండి బిఎ పట్టా పొందిన తరువాత, 1913 లో మద్రాస్ లా కాలేజీ నుండి న్యాయ శాస్త్రంలో పట్టా పొందారు. 1912లో గణిత విషయ ఉపాధ్యాయు డిగా నియుక్తులై, 1915లో న్యాయ వాద వృత్తిలోకి ప్రవేశించారు. స్వల్ప వ్యవధిలో, ఒక ప్రొఫెషనల్ న్యాయవాదిగా, అసాధారణ సామర్థ్యంతో ఖ్యాతిని పొందారు. జీవనోపాధిని సంపాదించే సాధనం గా మాత్రమే న్యాయవాద వృత్తిని చూడక, భారత ప్రజల అవసరాలకు అనుగుణంగా దేశ న్యాయ వ్యవస్థను మెరుగు పరచడంలో ఆసక్తి చూపారు. అయ్యంగార్ చాలా చిన్న వయస్సు లోనే స్వాతంత్ర్య ఉద్యమం లోకి ప్రవేశించారు. తన సొంత రాష్ట్రం లోనే, బ్రిటిష్ వలస వాదానికి వ్యతి రేకంగా జాతీయ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ప్రముఖ వ్యక్తులలో ఒకరిగా ఎదిగారు. కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వంలో ఉండి, పోరాడటమే లక్ష్యంగా, 1934 లో కేంద్ర శాసన సభ ఎన్నికలలో పోటీ చేయాలని నిర్ణయించు కున్నప్పుడు, అయ్యం గార్ అధిక మెజారిటీతో సభకు ఎన్నికయ్యారు. వాస్తవాలు మరియు గణాంకాలతో ఆయన సహజమైన చర్చా నైపుణ్యాల ద్వారా, అయ్యంగార్ త్వరలోనే అసెంబ్లీలో తన వాదనా పటిమతో తనదైన ముద్ర వేశారు. మొదట వ్యక్తిగత సత్యాగ్రహ ప్రచారంలో తరువాత 1942 'క్విట్ ఇండియా ఉద్యమంలో' పాల్గొన్నం దుకు 1940, 1944 మధ్య అయ్యం గార్ దాదాపు మూడు సంవత్స రాలు జైలు శిక్ష అనుభవించారు. రాజకీయ స్వేచ్ఛ కోసం ఉద్యమం లో చురుకుగా పాల్గొనడమే కాకుండా, సమాజం లోని అణగా రిన వర్గాల, సామాజిక విముక్తి దిశగా, నిర్దేశించిన వివిధ కార్య కలాపాలలో అయ్యంగార్ పాల్గొ న్నారు. అంటరాని సామర్థ్యం వంటి సామాజిక చెడులతో పోరాడటానికి గాంధీజీ నిర్మాణాత్మక కార్యక్రమాల నుండి ప్రేరణ పొందిన అయ్యంగార్, హరిజనులకు ఆలయ ప్రవేశం, అంటరాని తనం నిర్మూలన కోసం ఉద్యమాలలో ముందంజలో ఉన్నా రు. తరువాత, హరిజన్ సేవక్ సంఘ అధ్యక్షుడిగా తమ సామర్థ్యంలో, హరిజనుల ఆర్థిక, సామాజిక అభ్యున్నతి కోసం అనేక కార్యక్రమాలను చేపట్టారు. ఆయన మొట్టమొదటి సారిగా చిత్తూరు మున్సిపల్ కౌన్సిల్ కు ఎన్నిక అయ్యారు. తరువాత, చిత్తూరు కో – ఆపరేటివ్ డిస్ట్రిక్ట్ బ్యాంక్ డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు. చిత్తూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పనిచేశారు. అనంతరం ఆంధ్ర ప్రావిన్షియల్ కాంగ్రెస్ కమిటీ, అఖిల భారత కాంగ్రెస్ కమిటీకి ఎంపిక అయి నారు. 1946–47 మధ్య కాలంలో పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీ కార్య దర్శిగా కూడా పని చేశారు. రాజ్యాం గ అసెంబ్లీ సభ్యునిగా పని చేశారు. జి.వి.మవలంకర్‌ను రాజ్యాంగ అసెంబ్లీ (శాసనసభ) స్పీకర్‌గా ఎన్నుకున్న నేపథ్యంలో, అయ్యం గార్‌ను దాని డిప్యూటీ స్పీకర్‌గా ఎంపిక చేశారు. రాజ్యాంగ అసెంబ్లీ స్టీరింగ్ కమిటీలో కూడా పని చేశారు. 1950–52 మధ్య కాలంలో అయ్యంగార్ తాత్కాలిక పార్ల మెంటు డిప్యూటీ స్పీకర్‌గా కొన సాగారు. 1950 లో తాత్కాలిక పార్లమెంట్ మొదటి అంచనా కమిటీకి ఛైర్మన్‌గా ఎంపికయ్యారు. సమావేశాలను నైపుణ్యంగా నిర్వహించారు. అయ్యంగార్ గొప్ప, సమర్థ వంతమైన పార్ల మెంటు సభ్యుడని నిరూపించు కున్నారు. పార్లమెంటరీ నిబంధన లను నిలబెట్టడానికి కట్టుబడి ఉన్నారు. 1957 లో రెండవ లోక్‌సభ ఏర్పడి నప్పుడు, అయ్యంగార్ ఐదేళ్ల పాటు ఆయనను స్పీకర్‌గా ఏకగ్రీవం గా ఎన్నుకున్నారు. వాయిదా తీర్మా నాలు, బిల్లులు, తీర్మానాలు, స్టాండింగ్ కమిటీలు, కాలింగ్ అటెన్షన్ నోటీసులు మొదలైన వాటిపై అయ్యంగార్ పద్ధతి అనుసరణీయంగా మారింది. 1960 లో టోక్యోలో జరిగిన 49 వ ఇంటర్ పార్లమెంటరీ సమావేశానికి భారత పార్లమెంటరీ ప్రతినిధి బృందానికి నాయకుడిగా పనిచేసిన ఆయన, భారతదేశం లోని శాసన సభల ప్రిసైడింగ్ అధికారుల సమా వేశాల నిర్వహణలో ఆసక్తి చూపారు. 1962 సార్వత్రిక ఎన్ని కలలో అయ్యంగార్ మూడవ సారి లోక్‌సభకు ఎన్నికైనా, బీహార్ గవర్నర్‌గా పనిచేయడానికి వీలుగా ఆయన సభ్యత్వానికి రాజీనామా చేశారు. దాదాపు మూడు దశాబ్దాల విశిష్ట పార్లమెంటరీ జీవితంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. రాజకీయ జీవితాన్ని విడిచిపెట్టిన తరువాత, హరిజన్ సేవక్ సంఘ్, రామ్ విలాస్ సభ, చిత్తూరు డ్రామా టిక్ అసోసియేషన్స్, కాన్స్టిట్యూ షన్ క్లబ్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ వరల్డ్ ఫెడరల్ గవర్నమెంట్ తదితర సామాజిక – సాంస్కృతిక, విద్యా సంస్థలతో సంబంధం కొనసాగించారు. పార్లమెంటరీ జీవితం తరువాత, తన జీవితాంతం అయ్యంగార్ ఫిలాసఫీ, సంస్కృత సాహిత్యం, భారతీయ సంస్కృతి అధ్యయనం ప్రచారం పట్ల ఆయన ఎంతో ఆసక్తి చూపారు. కొంతకాలం సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ సభ్యుడిగా, రిషికుల్ విశ్వ విద్యాలయ ఛాన్సలర్‌గా పని చేశారు. భారత పార్లమెంటుపై ఒక పుస్తకాన్ని కూడా రాశారు. మతాలు ప్రధానంగా మనిషికి, మనిషికి మధ్య ఉన్న తేడాలను తొలగించడానికి, మనిషిలో సోదర భావనను పెంపొందించ డానికి తద్వారా అతన్ని ఉద్ధరించడానికి సహాయపడతాయని నమ్మారు. అయ్యంగార్ ప్రకారం, ఉన్నత కులం లేదా తక్కువ కులం వంటివి ఏవీ లేవు, కానీ ఉన్నత చైతన్యం, తక్కువ చైతన్యం మాత్రమే ఉన్నాయి, ఈ రెండింటికి పుట్టుకతో సంబంధం లేదు. పుట్టుక ప్రాతిపదికన ఆరాధన హక్కును తిరస్కరించడం దైవత్వానికి వ్యతిరేకంగా చేసిన నేరం అని నమ్మారు. ఈ నమ్మకమే హిందూ దేవాలయాల లోకి ప్రవేశించాలన్న దళితుల వాదనకు మద్దతు ఇవ్వడానికి ఆయన్ని ప్రేరేపించింది. బీహార్ గవర్నర్‌గా పూర్తి కాలం పనిచేసిన తరువాత, శేష జీవితం గడపడానికి తన స్వగ్రామమైన తిరుపతికి తిరిగి వచ్చి, అయ్యం గార్ 1978 మార్చి 19 న తన 87 వ ఏట చివరి శ్వాస తీసుకునే వరకు సేవలు అందించారు. నిబద్ధత కలిగిన వ్యక్తిగా చరిత్రలో నిలిచారు.

## లోక్‌సభలో తీవ్ర ఉద్రిక్తత...

- మొదటి పేజి తరువాయి

స్తంభింపజేయడం, ప్రొసీడింగ్స్ జరగకుండా అడ్డుకోవడం పార్లమెంటరీ సంప్రదాయాలకు విరుద్ధం" అని దిలీప్ సైకియా వ్యాఖ్యానించారు.

అంతకుముందు, సరిహద్దుల్లో చైనా ఆక్రమణల అంశంపై చర్చించాలంటూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పట్టుబట్టారు. మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే రాసిన పుస్తకానికి సంబంధించిన ఓ మ్యాగజైన్ కథనాన్ని రాహుల్ ప్రస్తావించారు. అయితే, ధృవీకరించని వార్తా కథనాలను సభలో చదవకూడదని ప్యానెల్ స్పీకర్ సైకియా అభ్యంతరం తెలపడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా రాహుల్ స్పందిస్తూ.. "మాట్లాడటానికి నాకు ఎవరి అనుమతి అవసరం లేదు. నేను ప్రతిపక్ష నాయకుడిని.. నాకు పర్మిషన్ అనే పదం వాడటం సరికాదు" అని మండిపడ్డారు. తూర్పు లడఖ్‌లో ఘర్షణల వల్ల భారత సైనికులు ప్రాణాలు కోల్పోయారని, దీనిపై ప్రధాని స్పందన ఏమిటని రాహుల్ ప్రశ్నించారు. ఈ సమయంలోనే అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం జరిగింది. విపక్ష సభ్యులు వెల్ లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. గందరగోళం మధ్యే సస్పెన్షన్ తీర్మానాన్ని ఆమోదించిన అనంతరం సభను మంగళవారానికి వాయిదా వేశారు. టీడీపీ ఎంపీ జి.ఎం. హరీశ్ బాలయోగి రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై మాట్లాడేందుకు ప్రయత్నించినప్పటికీ, సభలో నిరసనల హోరు తగ్గకపోవడంతో ప్రసంగం కొనసాగలేదు.

# నెయ్యి కల్తీపై ఏపీ కేబినెట్ సీరియస్..

కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం తయారీలో నెయ్యి కల్తీ వ్యవహారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని రాష్ట్ర కేబినెట్ తీవ్రంగా స్పందించింది. మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఇతర అజెండా అంశాలను పక్కనపెట్టి, కేవలం ఈ అంశంపైనే సుమారు మూడున్నర గంటల పాటు సుదీర్ఘంగా చర్చించింది. కోట్లాది మంది హిందువుల మనోభావాలతో ముడిపడిన ఈ వ్యవహారంలో దోషులు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకోవాలని, తిరుమల పవిత్రతను కాపాడటమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని కేబినెట్ అభిప్రాయపడింది. సీబీఐ సిట్ ఇచ్చిన నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టేందుకు ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని కీలక నిర్ణయం తీసుకుంది. సమావేశం అనంతరం మంత్రులు కొలుసు పార్థసారథి, పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్ మీడియా సమావేశంలో కేబినెట్ చర్చల వివరాలను వెల్లడించారు.

ఈ అంశంపై రాజకీయ ప్రయోజనాలు ఆశించడం లేదని, కేవలం భక్తుల మనోభావాలను గౌరవిస్తూ, శ్రీవారి క్షేత్ర పవిత్రతను పునరుద్ధరించడమే తమ లక్ష్యమని మంత్రులు స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహా మంత్రులందరూ ఈ అంశంపై తమ అభిప్రాయాలను నిర్మొహమాటంగా వెల్లడించారని తెలిపారు.

**కొలుసు పార్థసారథి ఏమన్నారంటే..**

మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ, "కోట్లాది మంది హిందువులు ఆరాధించే ఏడుకొండలవాని సన్నిధిలో జరిగిన ఈ మహాపాపం గురించి సీబీఐ ఇచ్చిన నివేదికపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించింది. హిందువుల మనోభావాలను, తిరుమల పవిత్రతను కాపాడటానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై మంత్రులందరూ అభిప్రాయాలు తెలిపారు. సీబీఐ ఛార్జ్‌షీట్ దాఖలు చేసినప్పటికీ, కోర్టు ఇంకా కాగ్నిజెన్స్ లోకి తీసుకోలేదు. అయితే, గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ తప్పిదాలను సరిదిద్దేందుకు, బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది," అని అన్నారు.

**పయ్యావుల కేశవ్ వివరణ..**

ఈ వ్యవహారంలోని సాంకేతిక, చట్టపరమైన అంశాలను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వివరించారు. "సీబీఐ నుంచి ప్రభుత్వానికి 11 పేజీల నివేదిక అందింది. ఇందులో గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఉద్దేశపూర్వక తప్పిదాలను స్పష్టంగా పేర్కొన్నారు. ఎన్‌డీబీ–సీఏఎల్ఎఫ్ ఇచ్చిన ల్యాబ్ రిపోర్ట్ ప్రకారం నెయ్యిలో సోయాబీన్, ఫిష్ ఆయిల్, బీఫ్ టాలో (జంతు కొవ్వు), లార్డ్ వంటివి ఉండే అవకాశం ఉందని (సస్పెక్టెడ్ అడల్టరెంట్స్) తేలింది. ఈ నివేదిక ఆధారంగానే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆనాడు ఆరోపణలు చేశారు" అని కేశవ్ తెలిపారు.

"2022లోనే సీఎఫ్‌టీఆర్ఐ రిపోర్టులో కల్తీ జరిగిందని తేలినా, నాటి టీటీడీ అధికారులు, పాలకమండలి చైర్మన్ దానిని తొక్కిపెట్టారు. గతంలో చంద్రబాబు హయాంలో నెయ్యి కొనుగోలుకు కఠిన నిబంధనలు పెట్టారు. కానీ, వైసీపీ ప్రభుత్వం వచ్చాక కేవలం ఐదు నెలల్లోనే ఆ నిబంధనలను ఉద్దేశపూర్వకంగా సడలించారు. పాలు సేకరించే సామర్థ్యం లేని సంస్థలకు, టర్నోవర్ తగ్గించి, అనుభవం లేని సంస్థలకు టెండర్లు కట్టబెట్టారు. బోలే బాబా వంటి సంస్థలకు టెండర్ దక్కించుకోవడానికి వైవీ సుబ్బారెడ్డి పీఏ ప్రయత్నించినట్లు కూడా ఆరోపణలున్నాయి. ఫేక్ డాక్యుమెంట్లతో టెండర్లలో పాల్గొన్నా అధికారులు అడ్డుకోలేదు. ఈ తప్పులన్నింటికీ నాటి ఈవో అనిల్ కుమార్ సింఘాల్, ఏఈవో ధర్మారెడ్డి, సీఏవో బాలాజీ బాధ్యులని సీబీఐ నివేదికలో పేర్కొంది. వారిపై చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసింది," అని పయ్యావుల కేశవ్ వివరించారు.

**నాదెండ్ల మనోహర్ స్పందన..**

మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, ఈ అంశంలో పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తామని చెప్పారు. "కేబినెట్ సమావేశానికి అడ్వకేట్ జనరల్‌ను కూడా ఆహ్వానించి న్యాయపరమైన సలహాలు తీసుకున్నాం. భక్తుల మనోభావాలతో ఆడుకున్న వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. 2022లో కల్తీ రిపోర్ట్ వచ్చాక, గత ప్రభుత్వం ఒక్కసారి కూడా నెయ్యి శాంపిల్స్‌ను టెస్టుకు పంపలేదు. ఎందుకంటే అందులో అసలు నెయ్యే లేదు. కానీ, మా కూటమి ప్రభుత్వం వచ్చాక 12 నుంచి 15 సార్లు నాణ్యతా పరీక్షలు చేయించాం. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నదే మా ప్రభుత్వ ఉద్దేశం" అని స్పష్టం చేశారు.

**సత్యకుమార్ యాదవ్ ఆరోపణలు..**

మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, వైసీపీ నాయకత్వం హిందూ ధర్మం మూలాలనే దెబ్బతీసే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. "కల్తీ జరిగిందని వైసీపీ నేతలే ఒప్పుకుంటున్నారు. అంటే, శ్రీవారి ప్రసాదంలో కల్తీని సమర్థిస్తున్నారా? అసలు పాలు లేకుండా నెయ్యి ఎలా తయారు చేస్తారు? రూ.250 కోట్ల అవినీతి కోసం కోట్లాది మంది భక్తుల విశ్వాసాలను దెబ్బతీశారు. గతంలో తిరుమలలో ఏడు కొండలకు బదులు రెండే ఉన్నారని వాదించడం, అన్యమత ప్రచారాన్ని ప్రోత్సహించడం, డిక్లరేషన్ ఇవ్వకుండా దర్శనాలు చేయడం వంటి చర్యలతో ఆలయ పవిత్రతను మంటగలిపారు. ఈ బోలే బాబా డైరీని దొడ్డిదారిన తెచ్చిన అలీబాబా ఎవరో, దాని వెనకున్న 40 దొంగలు ఎవరో ప్రజలకు తెలియాలి," అని సత్యకుమార్ యాదవ్ ఘాటుగా విమర్శించారు.

# మణిపూర్ నూతన ముఖ్యమంత్రిగా మార్షల్ ఆర్ట్స్ నిపుణుడు ఖేమ్‌చంద్ సింగ్

మణిపూర్‌లో ఏడాదిగా కొనసాగుతున్న రాజకీయ అనిశ్చితికి తెరపడింది. రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా అసెంబ్లీ మాజీ స్పీకర్ యుమ్నామ్ ఖేమ్‌చంద్ సింగ్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలో జరిగిన బీజేపీ శాసనసభాపక్ష సమావేశంలో ఆయనను శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నట్లు పార్టీ ప్రకటించింది. రాష్ట్రంలో జాతుల మధ్య హింస ప్రజ్వరిల్లిన నేపథ్యంలో, అప్పటి ముఖ్యమంత్రి ఎన్. బీరెన్ సింగ్ రాజీనామా చేయడంతో గతేడాది ఫిబ్రవరి 13 నుంచి మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన అమల్లో ఉన్న సంగతి తెలిసిందే. తాజాగా బీజేపీ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయంతో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. మెజారిటీ మైతీ వర్గానికి చెందిన ఖేమ్‌చంద్ సింగ్, గతంలో గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేశారు. 2017, 2022 అసెంబ్లీ ఎన్నికల్లో సింగ్జమీ నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున గెలుపొందారు. ఖేమ్‌చంద్ సింగ్ శ్రీకృష్ణుని భక్తుడు. అంతేకాకుండా, సంప్రదాయ టేక్వాండో క్రీడలో 5వ డాన్ బ్లాక్ బెల్ట్ సాధించిన తొలి భారతీయుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. హింస చెలరేగిన తర్వాత ఇటీవల గిరిజన ప్రాబల్యం ఉన్న ఉఖ్రుల్, కమ్‌జోంగ్ జిల్లాల్లో పర్యటించిన తొలి మైతీ నేతగా ఆయన నిలిచారు. ముఖ్యమంత్రి ఎన్నిక ప్రక్రియ కోసం బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్‌ను కేంద్ర పరిశీలకుడిగా నియమించింది. అధిష్ఠానం ఆదేశాలతో బీజేపీ, మిత్రపక్షాల ఎమ్మెల్యేలు ఢిల్లీకి చేరుకుని ఈ సమావేశంలో పాల్గొన్నారు. 60 మంది సభ్యులున్న మణిపూర్ అసెంబ్లీలో బీజేపీకి 37 మంది ఎమ్మెల్యేలు ఉండగా, మిత్రపక్షాలైన ఎన్పీపీకి ఆరుగురు, ఎన్పీఎఫ్‌కు ఐదుగురు ఎమ్మెల్యేల బలం ఉంది.

# ఎస్ఎఫ్‌డీఆర్ పరీక్ష విజయవంతం...

భారత రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) మరో కీలక విజయాన్ని అందుకుంది. సాలిడ్ ఫ్యూయల్ డక్టెడ్ రామ్‌జెట్ (ఎస్ఎఫ్‌డీఆర్) టెక్నాలజీని ఒడిశాలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటీఆర్) నుంచి విజయవంతంగా ప్రదర్శించింది. ఈ పరీక్షతో సుదూర గగనతల క్షిపణుల (ఎయిర్–టు–ఎయిర్ మిసైల్స్) తయారీలో భారత్ స్వయంసమృద్ధి దిశగా మరో ముందడుగు వేసినట్లయింది.

మంగళవారం ఉదయం 10:45 గంటల సమయంలో ఈ పరీక్షను నిర్వహించారు. ముందుగా గ్రౌండ్ బూస్టర్ సాయంతో క్షిపణి వ్యవస్థను నిర్దేశిత వేగానికి చేర్చారు. ఆ తర్వాత, నాజిల్–లెస్ బూస్టర్, రామ్‌జెట్ మోటార్ వంటి అన్ని ఉప వ్యవస్థలు ప్రణాళిక ప్రకారం అత్యంత కచ్చితత్వంతో పనిచేశాయి. ఈ పరీక్షకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఐటీఆర్‌లో ఏర్పాటు చేసిన ట్రాకింగ్ వ్యవస్థల ద్వారా నమోదు చేసి, ధృవీకరించారు.

ఈ అత్యాధునిక టెక్నాలజీ విజయవంతం కావడంతో భారత్‌కు గగనతలంలో గణనీయమైన వ్యూహాత్మక ప్రయోజనం లభించనుంది. శత్రు విమానాలను చాలా దూరం నుంచే అడ్డుకునే సామర్థ్యం భారత వాయుసేనకు అందుబాటులోకి వస్తుంది. దీంతో ఈ పరిజ్ఞానం కలిగిన కొద్ది దేశాల సరసన భారత్ చేరింది. డీఆర్‌డీవోకు చెందిన డీఆర్‌డీఎల్, హెచ్ఈఎంఆర్ఎల్, ఆర్‌సీఐ వంటి ప్రయోగశాలలు సంయుక్తంగా ఈ పరీక్షను నిర్వహించాయి. ఈ ప్రయోగం విజయవంతం కావడం పట్ల రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ డీఆర్‌డీవో శాస్త్రవేత్తలను, సంబంధిత పరిశ్రమలను అభినందించారు. ఇది భారత రక్షణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

# ఇంకా ఎన్నాళ్లీ బఫర్ జోన్లు?

ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, చైనా విషయంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధానమంత్రి కార్యాలయాన్ని (పీఎంఓ) ట్యాగ్ చేస్తూ సోషల్ మీడియా వేదికగా ఆరు సూటి ప్రశ్నలు సంధించారు. లడఖ్ సరిహద్దుల్లో చైనా దూకుడు, బఫర్ జోన్ల ఏర్పాటు, మౌలిక సదుపాయాల నిర్మాణం వంటి కీలక అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీశారు. ఒవైసీ తన ప్రశ్నల్లో, "చైనాతో ఎలాంటి ఒప్పందం కుదుర్చుకున్నారు? ఏప్రిల్ 2020కి ముందు మన సైన్యం పెట్రోలింగ్ నిర్వహించిన అన్ని ప్రాంతాల్లో ఇప్పుడు గస్తీ కాయగలదా? ఒకవేళ లేకపోతే, దానికి కారణమేంటి? ఈ బఫర్ జోన్లు ఎంతకాలం కొనసాగుతాయి?" అని ప్రభుత్వాన్ని నిలదీశారు. అంతేకాకుండా, "చైనాను చూసి ఎందుకు అంతగా భయపడుతున్నారు? చైనా సరిహద్దుల్లో కాల్పులు జరపకుండా మన సైన్యంపై ఇన్ని ఆంక్షలు ఎందుకు విధించారు? వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ)పై చైనా అవగాహననే బఫర్ జోన్లకు ప్రామాణికంగా మార్చారు" అని ఆయన తీవ్రంగా ఆరోపించారు. గత డిసెంబర్‌లో వచ్చిన 'ది ఎకానమిస్ట్' మ్యాగజైన్‌ను ప్రస్తావిస్తూ ఒవైసీ కేంద్రంపై విమర్శలు గుప్పించారు. "మీ ప్రభుత్వమే ఆ విదేశీ జర్నలిస్టును లడఖ్‌కు తీసుకెళ్లింది. 2020 నుంచి లడఖ్ సరిహద్దుల్లో చైనా మౌలిక సదుపాయాల అభివృద్ధి రెట్టింపు అయిందని ఆ కథనం పేర్కొంది. మనకంటే నాలుగు రెట్లు వేగంగా చైనా నిర్మాణాలు చేపడుతోందని కూడా తెలిపింది. ఇదంతా జరుగుతుంటే మనం ఎలా అనుమతిస్తున్నాం?" అని ఒవైసీ ప్రశ్నించారు.

అంతర్జాతీయ సంబంధాలపైనా ఆయన స్పందించారు. "పాకిస్థాన్‌కు చైనా అందిస్తున్న సైనిక సహకారాన్ని మీరు ఆపగలిగారా? ఒకవేళ ఆపలేకపోతే, చైనాతో మన స్నేహం వల్ల ప్రయోజనం ఏంటి?" అని ప్రశ్నించారు. చివరగా, పార్లమెంటు పనితీరుపై కూడా ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "ఈ కీలక అంశంపై ప్రతిపక్షాలు ప్రశ్నలు అడిగే అవకాశం లేకుండా పార్లమెంటును సజావుగా సాగనివ్వడం లేదని నేను భావిస్తున్నాను. రేపు సభలో గందరగోళం మధ్య పీఎంఓ నుంచి ఒక ప్రకటన వెలువడుతుంది అనుకుంటా" అని పేర్కొన్నారు. "ప్రభుత్వం తనకు సరైనదని భావించినదాన్ని కాకుండా, దేశానికి, ప్రజలకు ఏది మంచో అది చేయాలి" అని హితవు పలికారు. ఒవైసీ ప్రశ్నలు జాతీయ భద్రత, విదేశాంగ విధానంపై మరోసారి రాజకీయ చర్చను రేకెత్తించాయి.

# విడదల రజనిపై కేసు నమోదు

ఏపీలో వైసీపీ నేతలపై వరుసగా కేసులు నమోదవుతున్నాయి. తాజాగా మాజీ మంత్రి విడదల రజనిపై కేసు నమోదయింది. యడ్లపాడు పోలీసులు ఆమెపై కేసు నమోదు చేశారు. ఆమెతో పాటు మరో 21 మంది వైసీపీ నేతలపై కూడా కేసు నమోదయింది. కేసు వివరాల్లోకి వెళితే... గత నెల 30న యడ్లపాడులోని దేవస్థానానికి తన అనుచరులతో పాటు విడదల రజని వెళ్లారు. తిరుమల లడ్డూలో కల్తీ జరగలేదని చెపుతూ... ఆలయాన్ని శుద్ధి చేయడానికి ఆమె యత్నించారు. అయితే, ఆలయంలోకి వెళ్లకుండా టీడీపీ నేతలు ఆమెను అడ్డుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లో లోపలకు వెళతామని వైసీపీ నేతలు పట్టుబట్టడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు వైసీపీ నేతలకు సర్దిచెప్పి వెనక్కి పంపించారు. ఈ క్రమంలో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ప్రవర్తించారంటూ విడదల రజని, ఆమె అనుచరులపై పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా అంబటి రాంబాబు, జోగి రమేశ్‌లపై కూడా పోలీసు కేసులు నమోదైన సంగతి తెలిసిందే. చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు అంబటిపై... నారా లోకేశ్ పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు జోగి రమేశ్ పై కేసులు నమోదయ్యాయి. అంబటికి మేజిస్ట్రేట్ రిమాండ్ కూడా విధించారు.

## ఢిల్లీ చేరుకున్న నారా లోకేశ్... నేడు కేంద్రమంత్రులతో వరుస సమావేశాలు

- మొదటి పేజి తరువాయి

పలికారు. ఈ సందర్భంగా ఆయన టీడీపీ ఎంపీలతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. కాగా, రాష్ట్రానికి సంబంధించిన కీలక అభివృద్ధి పనులపై చర్చించేందుకు, నిధులు రాబట్టేందుకు లోకేశ్ రేపు (ఫిబ్రవరి 4) కేంద్ర మంత్రులతో వరుసగా సమావేశం కానున్నారు. ఈ రాత్రికి ఢిల్లీలోనే బస చేయనున్న లోకేశ్, బుధవారం పార్లమెంట్ భవనంలో పలువురు కేంద్ర మంత్రులతో కీలక భేటీలు జరపనున్నారు. ఈ పర్యటనలో ప్రధానంగా రాష్ట్రంలో ఐటీ రంగం విస్తరణ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల ఏర్పాటు, విద్యారంగ సంస్కరణలు వంటి అంశాలపై చర్చించనున్నారు. వీటితో పాటు ఏపీ విభజన చట్టంలోని హామీల అమలు, అమరావతి రాజధాని నిర్మాణానికి నిధులు, కొత్త ప్రాజెక్టుల మంజూరు వంటి విషయాలపై కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపనున్నారు. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి కేటాయించిన రాయితీలు, మౌలిక సదుపాయాల కల్పనపై సంబంధిత శాఖల మంత్రులతో లోకేశ్ చర్చించనున్నారు. అలాగే, రాష్ట్రంలో పురోగతిలో ఉన్న రూ.92,649 కోట్ల పనుల వివరాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంది. హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–చెన్నై హై–స్పీడ్ రైల్వే కారిడార్ల అంశంపై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశమయ్యే అవకాశం కూడా ఉంది. కీలక సమావేశాల అనంతరం బుధవారం రాత్రికి ఆయన తిరిగి ఉండవల్లిలోని నివాసానికి చేరుకోనున్నారు.

## అమెరికాతో వాణిజ్య ఒప్పందం..

అమెరికాతో వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో, రైతుల ప్రయోజనం అంశంపై భారత ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. రైతుల ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. అమెరికా, భారత్ వాణిజ్య ఒప్పందం జరిగిందని, అమెరికా ఉత్పత్తులను భారీగా కొనేందుకు భారత్ కట్టుబడి ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ట్రంప్ పోస్టు నేపథ్యంలో విపక్షాల నుంచి విమర్శలు వచ్చాయి. దీంతో కేంద్రం స్పందించింది. అమెరికా మన దేశానికి ఎగుమతి చేసే వ్యవసాయ, పాడి ఉత్పత్తులపై సుంకాలను తగ్గించేందుకు మొదటి నుంచి అంగీకరించడం లేదని స్పష్టం చేసింది. వాణిజ్య ఒప్పందం నేపథ్యంలోనూ అదే విషయాన్ని స్పష్టం చేశామని పేర్కొంది. వెనెజువెలా చమురు కొనుగోలు అంశం పరిశీలనలో ఉందని తెలిపింది. ఆంక్షలు అమల్లో ఉన్నప్పుడు మనం వెనెజువెలా నుంచి చమురు కొనుగోలు చేయలేదని, ఇప్పుడు వాటిని ఎత్తివేశారని పేర్కొన్నారు. చమురు కొనుగోలు చేస్తామన్నారు. అమెరికా నుంచి వచ్చే వ్యవసాయ ఉత్పత్తులు చాలా తక్కువకు వస్తాయి. వాటిపై సుంకాలు తగ్గిస్తే మన దేశంలో రైతులపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఇంతకాలం వాణిజ్య చర్చల ప్రతిష్ఠంభనకు ఇది ప్రధాన కారణం. మన రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టి వాణిజ్యం ఒప్పందం కోసం కేంద్రం ఆసక్తి చూపలేదు. ఇప్పుడు వాణిజ్య ఒప్పందం కుదరడంతో వస్తున్న విమర్శలకు కేంద్రం స్పష్టతనిచ్చింది.

## పోటీదారులతో పోలిస్తే అమెరికాతో భారత్ మెరుగైన ఒప్పందాన్ని సాధించింది

- మొదటి పేజి తరువాయి

ఈ ఒప్పందంతో పేదలు, రైతులు, యువత, మత్స్యకారులకు అపారమైన అవకాశాలు లభిస్తాయని అన్నారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై పార్లమెంటులో ప్రకటన చేద్దామని భావించానని, కానీ రాహుల్ గాంధీ నేతృత్వంలోని ప్రతిపక్షం గందరగోళ పరిస్థితులను సృష్టించిందని అన్నారు. ఈ ఒప్పందంపై దేశాన్ని తప్పుదోవ పట్టించేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఒప్పందంతో మన దేశ వ్యవసాయ, పశుసంవర్ధక, పాడి పరిశ్రమల ప్రయోజనాలను ప్రధాని మోదీ పరిరక్షించారని అన్నారు. నరేంద్ర మోదీ, ట్రంప్ మధ్య ఉన్న సత్సంబంధాల వల్లనే రెండు దేశాల మధ్య ఈ వాణిజ్య ఒప్పందం కుదిరిందని అన్నారు. సుంకాల తగ్గింపు ప్రకటన ట్రంప్ నుంచి వచ్చిందని, వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన తుది వివరాలను ఖరారు చేశాక, సంయుక్త ప్రకటన విడుదల చేస్తామని అన్నారు.

## 2029లో రిటర్న్ గిఫ్ట్ ఇస్తాం

వైసీపీ నేతలపై దాడులకు పాల్పడుతూ కూటమి నేతలు ఆటవిక పాలనకు తెరలేపారని మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. ఏపీని రావణకాష్ఠంగా మార్చారని మండిపడ్డారు. మరో మూడేళ్ల పాటు ఆటవిక పాలనను భరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. 2029లో రిటర్న్ గిఫ్ట్ ఇస్తామని అన్నారు. కాపు, బీసీ నేతలపై దాడులకు పాల్పడుతున్నారని అనిల్ విమర్శించారు. తిరుమల లడ్డూ గురించి దుష్ప్రచారం చేసి అడ్డంగా దొరికేశారని... దాన్నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు వైసీపీ నేతలపై దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫ్రస్ట్రేషన్ లో ఉన్నారని ఎద్దేవా చేశారు. కూటమి నేతలకు దమ్ముంటే పోలీసు వ్యవస్థను పక్కన పెట్టి సవాలు విసరాలని ఛాలెంజ్ చేశారు.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి జిల్లా । చిత్తూరు జిల్లా । వై.ఎస్.ఆర్. కడప జిల్లా ।

## సమ్మె నోటీసు ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలి.

బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 3. కార్మికులుగా గుర్తించి కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలి. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలి. నాలుగు లేబర్ కోర్టులను రద్దు చేయాలి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలనే డిమాండ్లతో కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఫిబ్రవరి 12వ తేదీ జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఆశా వర్కర్లు అందరూ పాల్గొంటారని తెలియజేస్తూ మంగళవారం బుచ్చిరెడ్డిపాళెం అర్బన్ పిహెచ్ సి డాక్టర్ మనోజ్ కె సమ్మె నోటీసును అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు దాసరి రాదయ్య చల్లకొలుసు మల్లికార్జున ఆశ వర్కర్లు వెంకటరమణ సుభాషిని తదితరులు పాల్గొన్నారు





## ఏకీకృత కుటుంబ సర్వేకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

గూడూరు, పెన్ పవర్,ఫిబ్రవరి, 03:
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం "స్వర్ణాంధ్ర" లక్ష్య సాధనలో భాగంగా ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ( ఎఫ్ బి ఎం ఎస్) ద్వారా ఏకీకృత కుటుంబ సర్వే నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ప్లానింగ్ (శ×××) శాఖ నుంచి జి.ఓ.ఆర్.టి. నెం.207, తేదీ 23-12-2025 విడుదలైంది. రాష్ట్రవ్యాప్తంగా కుటుంబాల వారీగా సమగ్ర, ఖచ్చితమైన డేటా సేకరణే లక్ష్యంగా ఈ సర్వేను చేపట్టనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. గూడూరు పట్టణంలో గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో జి.ఎస్.డబ్ల్యు.ఎస్ సచివాలయ సిబ్బంది డిజిటల్ యాప్ ద్వారా సర్వే నిర్వహిస్తున్నారు.
ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు కాలేషా మరియు రేష్మ చురుకుగా పాల్గొని, కేటాయించిన కుటుంబాల వివరాలను సరిచూసుకుంటూ ఖచ్చితంగా నమోదు చేశారు. ప్రభుత్వం చేపట్టిన ఈ సర్వే ప్రజలకు మెరుగైన సేవలందించడంలో కీలకంగా నిలవనుంది.

## నేత్ర సమస్యలపై అవగాహనతో దృష్టిలోపం నివారణ సాధ్యం-

### -ఎం.వి. రావు ఫౌండేషన్ సేవలు అనిర్వచనీయం...ఎస్ఐ నిఖిల్



గూడూరు, పెన్ పవర్,ఫిబ్రవరి,3:
ఎం.వి. రావు ఫౌండేషన్ సేవలు నిజంగా అనిర్వచనీయమని వాకాడు సబ్ ఇన్స్పెక్టర్ నిఖిల్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వాకాడు పంచాయతీ గొల్లపాలెం గ్రామంలోని ఎంపీ పాఠశాల ఆవరణలో గ్రామ ప్రజలకు ఉచిత కంటి అద్దాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.
గత శనివారం ఎం.వి. రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలో కంటి సమస్యలతో దృష్టిలోపం కలిగిన 25 మంది మహిళలు, వృద్ధులను గుర్తించారు. వీరికి ఫౌండేషన్ దాతృత్వంతో సుమారు రూ.20 వేల విలువైన కంటి అద్దాలను తయారు చేయించి, మంగళవారం వాకాడు సబ్ ఇన్స్పెక్టర్ నిఖిల్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎస్ఐ నిఖిల్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ నేత్ర సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపించి సకాలంలో చికిత్స తీసుకుంటే దృష్టిలోపం వంటి సమస్యలను నివారించవచ్చని సూచించారు. ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవడం ఎంతో అవసరమన్నారు.ఎం.వి. రావు ఫౌండేషన్ 18వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గత 18 సంవత్సరాలుగా 10,805 సేవా కార్యక్రమాలు నిర్వహించి నిరుపేదలకు నిరంతరం సేవలందిస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులను ఎస్ఐ నిఖిల్ అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎంపీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మేరీ సునీత, జాలాది కిషోర్, ఎం.వి. రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ, కార్యదర్శి ఎం. విజయలక్ష్మి, ఉపాధ్యాయురాలు విజయ పాల్గొన్నారు. అలాగే గ్రామ ప్రజలు, విద్యార్థులు, రమేష్ ఐ కేర్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, ఫౌండేషన్ కార్యవర్గ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## బల్లి జేమ్స్ ప్రభాకర్‌కు నివాళులు అర్పించిన ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్




గూడూరు, పెన్ పవర్, ఫిబ్రవరి, 3:
పట్టణంలోని లూథరన్ చర్చ్‌లో స్వర్గస్తులైన బల్లి జేమ్స్ ప్రభాకర్ భౌతికకాయానికి శాసన సభ్యులు డాక్టర్ పాశిం సునీల్ కుమార్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ పాశిం సునీల్ కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి పట్ల తన సంతాపాన్ని తెలియజేశారు.బల్లి జేమ్స్ ప్రభాకర్ సమాజంలో మంచి పేరు ప్రతిష్టలు సంపాదించారని, ఆయన మరణం కుటుంబానికి మాత్రమే కాకుండా సమాజానికి కూడా తీరని లోటని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, చర్చ్ పెద్దలు, స్థానిక నాయకులు మరియు పట్టణ ప్రజలు పాల్గొని బల్లి జేమ్స్ ప్రభాకర్ కు చివరి వీడ్కోలు పలికారు.

## మహాశివరాత్రి ఏర్పాట్లలో భాగంగా ఓంకార జ్యోతిర్లింగేశ్వర స్వామి ఆలయ పనుల పరిశీలన

### కాంగ్రెస్ ఆధ్వర్యంలో అన్నదానానికి ఏర్పాట్లు







రేణిగుంట , పెన్ పవర్ , ఫిబ్రవరి 3 :
రేణిగుంట మండలం వేదల్ల చెరువు గ్రామ సమీపంలో గల శ్రీ ఓంకార జ్యోతిర్లింగేశ్వర స్వామి వారి దేవాలయం వద్ద మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని చేపట్టిన ఏర్పాట్లను శ్రీకాళహస్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు.
ఈ సందర్భంగా రేణిగుంట మండల అధ్యక్షులు చెరుకు తోట రాహుల్ ఆర్థిక సహకారంతో స్వామివారి ఆలయంలో చేపడుతున్న పెయింటింగ్ పనులు, ఇతర సౌకర్యాల ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు.ఈ సందర్భంగా తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ, ఈ క్షేత్రం ఎంతో మహిమగలదని, మహాశివరాత్రి రోజున భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారి దర్శనం చేసుకుని కృపా కటాక్షాలు పొందుతారని తెలిపారు. మహాశివరాత్రి పర్వదినాన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కృష్ణయ్య స్వామి, రేణిగుంట మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆసిఫ్, మండల ప్రధాన కార్యదర్శి గుణశేఖర్, సుబ్రహ్మణ్యం తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



## లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాతో ఎంపి విపిఆర్ భేటీ

నెల్లూరు పెన్ పవర్ ఫిబ్రవరి 3.
లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ఢిల్లీలోని స్పీకర్ కార్యాలయంలో స్పీకర్ ఓం బిర్లా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయనతో భేటి అయిన ఎంపీ.. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చించారు. సభలో పరిస్థితులపై మాట్లాడారు. భేటీలో ఇతర టీడీపీ ఎంపీలు పాల్గొన్నారు.

## ప్రజలకు ఏ సమస్య ఉన్నా తోడుగా,అండగా ఉంటాం.



నెల్లూరు పెన్ పవర్ ఫిబ్రవరి 3.
నెల్లూరు రూరల్ మండల పరిషత్ అధ్యక్షుడు బూడిద విజయ్ కుమార్ మరియు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పల్లంరెడ్డి రవీందర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో 370 కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధిపనులు జరుగుతున్నాయి. టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి పెనుబర్తి గ్రామ అభివృద్ధికి 2కోట్ల 73 లక్షల రూపాయలు కేటాయించాము. టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మాటకు కట్టుబడివుండే మంచి ప్రభుత్వం కూటమి ప్రభుత్వం. ప్రజలకు ఏ సమస్య ఉన్నా తోడుగా, అండగా ఉంటాం. టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి.కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి అభివృద్ధి, సంక్షేమం రెండూ రెండు కళ్ళలా భావించి పనిచేస్తున్నాము. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు సహాయ సహకారాలతో ఎన్నడూ లేని విధంగా రూరల్ శాసనసభ్యులు శ్రీధర్ రెడ్డి సారధ్యంలో అభివృద్ధి జరుగుతోంది. టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. ఇంతమంచి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కి ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలి. టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి

## భాష్యం లెక్సికన్ లీగ్ స్పెల్‌బీ ఛాంపియన్‌గా శ్రీకాళహస్తి చిన్నారి ఎం. ప్రవాసిని

శ్రీకాళహస్తి ,పెన్ పవర్ ,ఫిబ్రవరి, 03 :
హాస్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన భాష్యం లెక్సికన్ లీగ్ స్పెల్‌ఒడ్ ఒడిస్సీ 202526 సెంట్రల్ లెక్సికెన్ లెజెండ్స్ స్పెల్‌బీ పోటీలలో భాష్యం స్కూల్, తిరుపతి జోన్, శ్రీకాళహస్తి బ్రాంచ్‌కు చెందిన ఏడో తరగతి విద్యార్థిని ఎం. ప్రవాసిని ఏపీ స్థాయిలో ఛాంపియన్‌గా నిలిచింది.ఈ సందర్భంగా భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ చేతుల మీదుగా




చిన్నారి ప్రవాసిని గోల్డ్ మెడల్‌తో పాటు జ్ఞాపికలను స్వీకరించింది.ప్రవాసిని ప్రతిభను ప్రశంసించిన పలువురు, ఆమె ఇంగ్లీష్ భాషలోనే కాకుండా సంస్కృతంలో భగవద్గీత పఠనంలోనూ అసాధారణ ప్రతిభ కనబరిచిన విషయాన్ని గుర్తు చేశారు. గతంలో ఆమె భగవద్గీత పఠనంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర స్థాయి అవార్డులు గెలుచుకున్న విషయం విశేషం. అలాగే ప్రతి సంవత్సరం శ్రీకాళహస్తి మహాశివరాత్రి సాంస్కృతిక కార్యక్రమాల్లో భగవద్గీత పఠనం చేసి, దాని అర్థాలను ఇంగ్లీష్‌లో వివరిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నది.ఈ ఘన విజయాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తి పట్టణ భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం చిన్నారి ప్రవాసినిని హృదయపూర్వకంగా అభినందించారు.

## పీ.హెచ్.పీలు గ్రామీణ ప్రాంత ప్రజలకు క్యాన్సర్ పై అవగాహన కల్పించాలి



నెల్లూరు పెన్ పవర్ ఫిబ్రవరి 3.
4వ తేదీ ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం. జి. రంజిత్ రెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ మెడికవర్ హాస్పిటల్, నెల్లూరు. కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కావలి డివిజన్ సభ్యులకు నెల్లూరు మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు మంగళవారం, కావలిలోని హోటల్ లేక్ వ్యూ సమావేశ మందిరం నందు జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మెడికవర్ హాస్పిటల్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ జి.రంజిత్ రెడ్డి మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ బారిన పడుతున్న వారి సంఖ్య చాలా అధికమవుతున్నదని, భారతదేశం క్యాన్సర్లకు రాజధానిగా మారబోతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారని అన్నారు. ముఖ్యంగా పీ.హెచ్.పీలు గ్రామీణ ప్రాంత ప్రజలు క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండి, క్యాన్సర్ బారిన పడకుండా వారిని చైతన్యవంతులుగా చేయాలని అన్నారు. క్యాన్సర్ కారణాలలో శృతి తప్పిన జీవనశైలి, శ్రమ లేని ఉద్యోగాలు, కలుషిత ఆహారం, ఇనాఆర్గానిక్, హార్సనిక్ తో కలుషితమైన నీరు, నేల, ఆహార పదార్థాలు ఊపిరితిత్తులు మరియు చర్మ క్యాన్సర్లకు కారణం అవుతున్నాయి అన్నారు. చాలా ముఖ్యంగా 10 రకాల క్యాన్సర్లు మానవులలో మరణానికి కారణం అవుతున్నాయని, అవి ప్యాంక్రియాటిక్ క్యాన్సర్, లివర్ క్యాన్సర్, బైల్ డక్ట క్యాన్సర్, లంగ్ క్యాన్సర్, బ్రెయిన్ క్యాన్సర్ మరియు రక్తనాళాల క్యాన్సర్, బోన్ క్యాన్సర్, స్టమక్ క్యాన్సర్, ఓవేరియన్ క్యాన్సర్ ఇవి చాలా వరకు చికిత్సకు లొంగక మరణానికి దారి తీసేవిగా తెలుస్తుందన్నారు. అయితే చికిత్సకు లొంగే క్యాన్సర్లుగా థైరాయిడ్, బ్రెస్ట్, ప్రోస్టేట్, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ మరియు చర్మ సంబంధ క్యాన్సర్ చాలా వరకు చికిత్సతో నయం చేయవచ్చని అన్నారు ఈ సందర్భంగా క్యాన్సర్ కి కారణాలు పర్యావరణ కాలుష్యంపై కరపత్రము అవిష్కరించారు అనంతరం జి రజిత్ రెడ్డి డాక్టర్ మనోజ్ లను శాలవాలతో ఘనంగా సన్మానం చేశారు ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ అనిల్ పిఆర్ ఓ రమేష్ జిల్లా పీ హెచ్ పి నాయకులు శాఖవరపు వేణుగోపాల్ కొరట్ల శేషయ్య దేవరకొండ శ్రీనివాసులు ఉప్పలపాటి రామదాసు నర్సాపురం ప్రసాద్ డివిజన్ నాయకులు పివి రమణయ్య ఓ వస్తానయ్య షేక్ జిలాని చలపతిరావు ఎం దయాకర్ రావు తదితరులు పాల్గొన్నారు

## మంత్రి నారా లోకేష్ కు ఎంపీ వేమిరెడ్డి ఆత్మీయ స్వాగతం





నెల్లూరు పెన్ పవర్ ఫిబ్రవరి 3.
రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టుల విషయమై కేంద్ర మంత్రులను కలిసేందుకు ఢిల్లీ చేరుకున్న రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి స్వాగతం పలికారు. మంగళవారం సాయంత్రం రాత్రి ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ కు చేరుకున్న నారా లోకేష్ ఎంపీ వేమిరెడ్డి ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీని నారా లోకేష్ ఆప్యాయంగా పలకరించారు.

## శ్రీకాళహస్తీశ్వరుడి సన్నిధిలో సినీ నటుడు నందమూరి కళ్యాణ్ రామ్ ప్రత్యేక దర్శనం



శ్రీకాళహస్తి , పెన్ పవర్ , ఫిబ్రవరి, 03 :
శ్రీ జ్ఞాన ప్రసూనాంబికా దేవి సమేత శ్రీ కాళహస్తీశ్వర స్వామి దర్శనార్థం ప్రముఖ సినీ నటుడు నందమూరి కళ్యాణ్ రామ్ మంగళవారం శ్రీకాళహస్తి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మీడియా అధికార ప్రతినిధి నాగమల్లి దుర్గాప్రసాద్, బాలాజీ రెడ్డి, ఖాదర్‌ల ఆధ్వర్యంలో కళ్యాణ్ రామ్‌కు స్వామివారి ప్రత్యేక దర్శనాన్ని ఏర్పాటు చేశారు. దర్శనానంతరం ఆలయ అర్చకులు వాయులింగేశ్వరుని తీర్థప్రసాదాలను అందజేయగా, వేద పండితుల ఆశీర్వచనాన్ని ఆయన స్వీకరించారు. అనంతరం శ్రీ జ్ఞాన ప్రసూనాంబికా దేవి సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి జ్ఞాపికను ఆలయ నిర్వాహకులు కళ్యాణ్ రామ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థి సంఘం నేతల కిడ్నాప్.

### - కలెక్టర్ కార్యాలయం ఎదుట విద్యార్థి సంఘాలు నిరసన. -కిడ్నాప్ గురైన బాధితులను గుర్తించిన పోలీసులు.

### -మంచు మోహన్ బాబు మంచి విష్ణు ల పై కిడ్నాప్ కేసు.







తిరుపతి, పెన్ పవర్, ఫిబ్రవరి 3.
మోహన్ బాబు యూనివర్సిటీలో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్న కారణాలతో విద్యార్థి సంఘాలు వ్యతిరేకించాయి. దీనిపై పలుమార్లు ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం శూన్యం కావడంతో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు సన్నిద్ధం అయ్యారు. అయితే ఈ విషయాన్ని పసిగట్టిన మోహన్ బాబు యూనివర్సిటీ సెక్యూరిటీ సిబ్బంది బౌన్సర్లు పలు వాహనాల్లో కలెక్టర్ కార్యాలయం వద్దకు వచ్చి చిత్తూరు జిల్లా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అక్బర్ ను ఎస్వి యూనివర్సిటీ విద్యార్థి సంఘం నాయకుడు వినోద్ లను కిడ్నాప్ చేశారు. దీంతో విద్యార్థి సంఘాలు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. సిఐటి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి జిల్లాఎస్పీ సుబ్బరాయుడుకు సమాచారం తెలియజేశారు విద్యార్థులకు ఏవైనా హాని తలపెడితే పెద్ద ఎత్తున ధర్నాలకు దిగుతామని తెలపడంతో ఎస్పీ ఆధ్వర్యంలో టీంలుగా ఏర్పడి గంటల వ్యవధిలోనే నారావారిపల్లె సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించి ఇరువురి విద్యార్థులను వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కొంతమంది పట్టు పడగా మరికొంతమంది అటవీ ప్రాంతంలోకి పారిపోయారు. ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులు అక్బర్, వినోద్ లను కిడ్నాప్ చేసిన వారిపైన తిరుచానూరు పోలీసులు కేసు నమోదు చేశారు. జతీ. చీశీ. 23/2026 ఖ/ం 191(2), 115(2), 140(1), 126(2), 351(2), తీ/ష 190, 61(2) దీచీూ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కాగా మోహన్ బాబు యూనివర్సిటీ పి ఆర్ ఓ-ూ1సతీష్,-ూ2 మంచు మోహన్ బాబు,-ూ3 మంచు విష్ణు ల తో పాటు మరో 20 మంది మీద కేసు నమోదు చేశారు.

## పాత వంగల్లు లో నీటి పనులు ప్రారంభమైంది





కొడవలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 3.
కొడవలూరు మండలంలో పాత వంగల్లు పంచాయతీ గ్రామం లో రాబోవు ఎండ కాలం తాగు నీటి సమస్య రాకుండా ఉండేందుకు ముందుగానే మన ప్రియతమ నేత కోవూరు నియోజకవర్గం శాసన సభ్యులు రాలు శ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మన గ్రామం కి 5 .00 లక్షలు మంజూరు చేశారు . మేడమ్ ఆదేశాలతో ఈ పనిని పూర్తి చేయాలని వెంటనే పాత వంగల్లు పంచాయతీ టీడీపీ పార్టీ అధ్యక్షులు శ్రీ కంచర్ల సుబ్బా నాయుడు మరియు కొడవలూరు మండల టీడీపీ పార్టీ కార్యనిర్వహణ కార్యదర్శి శ్రీ నన్నం వెంకటరావు పనులు ప్రారంభించారు ఊరి ప్రజలు అందరూ శాసన సభ్యులు రాలి కృతజ్ఞతలు తెలియజేశారు

# ఒకే నెంబర్ ప్లేట్లతో తిరుగుతున్న రెండు బోర్ వెల్ లారీలు సీజ్

### - వెంటాడి లారీలను సీజ్ చేసిన ఎంవిఐ మధుసూదన్

### - ఎంవిఐ కు అధికారపార్టీ నాయకుల వత్తిడి !

పలమనేరు, పెన్ పవర్, ఫిబ్రవరి 03,
పలమనేరు నియోజకవర్గ ప్రాంతంలో కొన్ని సంవత్సరాలుగా ఇక్కడి అధికారుల కల్లుగప్పి ఒకే నెంబర్ ప్లేట్లతో రెండు బోర్ వెల్ లారీలు తిరుగుతూ, కేవలం ఒక లారీకి కట్టే పన్నులు కడుతూ, తద్వారా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. అయితే ఇక్కడి మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ మధుసూధన్ అత్యంత పక్కా సమాచారంతో పలమనేరు పట్టణానికి సమీపంలోని పారిశ్రామికవాడలో ఉన్న ఈరెండు లారీలను సోమవారం రాత్రి వెంటాడి పట్టుకుని సీజ్ చేశారు. సీజ్ చేసిన వాహనాలను పలమనేరు ఆర్టీసీ డిపోకు తరలించారు. ఈనేపథ్యంలో నియోజకవర్గ పరిధిలో ఎక్కడ చూసినా భూగర్భజలాలు పుష్కలంగా ఉన్నాయి. దీనిని ఆసరాగా చేసుకుని చుట్టుపక్కల రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచీ బోర్ వెల్ లారీ యజమానులు వాహనాలు ఏర్పాటు చేసుకుని కొన్ని సంవత్సరాలుగా ఇక్కడే స్థిరపడిపోయారు. ఇందులో భాగంగా తమిళనాడు రాష్ట్రానికి చెందిన జైక్రిష్ణ బోర్ వెల్ లారీ ఓనర్ కర్ణాటక రాష్ట్రంలో వాహనాలను కొనుగోలు చేస్తుంటారు. ఎందుకంటే కర్ణాటక రాష్ట్రంలో ఈ వాహనాల కొనుగోలులో పన్నులు తక్కువ వసూలు చేస్తుంటారు. అందుకే తమిళనాడు వ్యక్తులు అక్కడ కెళ్ళి బోర్ లారీలను కొనుగోలు చేస్తారు. అదే తమిళనాడు రాష్ట్ర వాహనాలను కోనుగోలు చేస్తే అధిక మొత్తంలో పన్నులు పడతాయని కొనడం లేదు. ఇదే తరహాలో జయక్రిష్ణ బోర్ వెల్ యజమాని ఒకలారీని కర్ణాటక రాష్ట్రంలో కొనుగోలు చేసి తన వద్ద వున్న పాత బోర్ వెల్ లారీని (ఈ లారీకి సంబందించిన పత్రాలు) ఎటువంటి పత్రాలు లేని బోర్ వెల్ లారీకి ముందుగా కర్ణాటకలో కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించిన నెంబర్ ను తనవద్ద ఉన్న రెండో లారీకి అదే నెంబర్ ప్లేట్ను అమర్చి ఇక్కడ దర్జాగా తిరుగున్నారు.

**ఒక లారీ రికార్డులే మరో లారీకి కూడా..**

మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ మధుసూదన్ సీజ్ చేసిన లారీలను నిశితంగా పరిశీలించి, చివరకు ఆయనే విస్తుపోయారు. కారణం ఏమంటే ఒక లారీకి ఉన్న, నెంబర్ ప్లేట్ లోని నెంబర్లే కాకుండా ఛాసీ మరియు ఇంజన్ నెంబర్ కూడా దాదాపు ఒకటే విధంగా మరో లారీకి ఉండడం, అలాగే ఈ లారీలే కొన్ని సంవత్సరాలుగా ఇక్కడ తిరుగుతూ ఒక లారీకి మాత్రమే పన్నులు కట్టి మరో లారీకి కట్టకుండా కొన్ని లక్షలాది రూపాయలు ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టిన తీరు అందరినీ ముక్కుమీద వెలువేసుకొనేలా చేసింది. ఈ క్రమంలో ఇటువంటి రెండు, రెండు వాహనాలు ఇంకా ఉన్నట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పూర్తిగా విచారించి తగుచర్యలు తీసుకొంటామని ఆయన అన్నారు.



**లారీలు వదిలేయాలని అధికారికి నాయకుల వత్తిడి**

సోమవారం అత్యంత చాకచక్యంగా గుర్తించి, వెంటాడి మరీ ఒకటే నెంబర్ తో తిరుగుతున్న రెండు లారీలను, అదుపులోకి తీసుకుని, వాటిని పట్టణంలోని ఆర్టీసీ డిపోకు తరలిస్తుండగా, వాటిని సీజ్ చేయ వద్దని, ఆ లారీలు వి.కోట మండలానికి చెందిన బడా నాయకునికి సంబంధించినది కావున వెంటనే వదిలేయాలని పట్టణానికి చెందిన నియోజకవర్గ స్థాయి అధికార పార్టీ నాయకుడు మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ మధుసూదన్ పై వత్తిడి చేశారు. కోట్లాది రూపాయల లారీలు ఇలా ప్రభుత్వాన్ని, మరో వైపు అధికారుల కళ్ళుగప్పి తిరగడమే కాకుండా, తీరా అవి పట్టుబడితే వాటిని వదిలేయాలని వత్తిడి తేవడం సరైన పద్ధతేనా అని నాయకులు తెలుసుకోవాలి.

## శ్రీవిద్యానికేతన్‌లో ఎస్ఎఫ్ఐ నాయకులపై దాడి, కిడ్నాప్ హేయం - సీఐటీయూ నిరసన



శ్రీకాళహస్తి , పెన్ పవర్ , ఫిబ్రవరి ,03 :
శ్రీవిద్యానికేతన్‌లో విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేపట్టేందుకు వెళ్లిన ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అక్బర్, ఎస్వీయూ నాయకుడు వినోద్‌లపై యాజమాన్యం దాడి చేసి కిడ్నాప్ చేయడం హేయమైన చర్యని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య తీవ్రంగా ఖండించారు.
ఎస్ఎఫ్ఐ నాయకులపై దాడి, కిడ్నాప్‌కు వ్యతిరేకంగా మంగళవారం శ్రీకాళహస్తి పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ, శ్రీవిద్యానికేతన్‌లో విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారంటూ తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు ప్రశ్నిస్తే వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థి సమస్యలపై ఆందోళన చేపట్టేందుకు వెళ్లిన ఎస్ఎఫ్ఐ నాయకులపై దాడి చేసి కిడ్నాప్ చేయడం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. ఈ ఘటనకు శ్రీవిద్యానికేతన్ వ్యవస్థాపకుడు మోహన్‌బాబు, మంచు విష్ణు బాధ్యత వహించాలని, వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా శ్రీవిద్యానికేతన్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, గంధం మణి, కుమార్, వేణు, వెంకటేష్, గురునాధం తదితరులు పాల్గొన్నారు



# నెల్లూరు జిల్లా గ్రంధాలయం సంస్థ చైర్మన్ మేకపాటి శాంతి కుమారి శుభాకాంక్షలు

నెల్లూరు పెన్ పవర్ ఫిబ్రవరి 3.



నెల్లూరు జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ గా నా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి విచ్చేసి ఆశీస్సులు, శుభాకాంక్షలు తెలియజేసిన మంత్రి, శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు,కూటమి పార్టీ జిల్లా అధ్యక్షులు, తెలుగుదేశం, బిజెపి, జనసేన నాయకులకు కార్యకర్తలకు బంధుమిత్రులకు, కుటుంబ సభ్యులకు, యువతకు , గ్రంధాలయం సంస్థ ఉద్యోగస్తులకు, కార్యక్రమానికి సహకరించిన సహకరించిన పోలీస్ డిపార్ట్మెంట్ కి ప్రతి ఒక్కరికి పేరుపేరునా నా హృదయపూర్వక ధన్యవాదాలు..

# ఇద్దరు గంజాయి స్మగ్లర్లు అరెస్ట్.

## -6,60,000 విలువగల 22 కేజీల గంజాయి స్వాధీనం.

చంద్రగిరి, పెన్ పవర్, ఫిబ్రవరి 3.




గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరు స్మగ్లర్లను చంద్రగిరి పోలీసులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. వారి వద్ద నుండి 6,60,000. వేల విలువగల 22 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనిపై చంద్రగిరి పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశం నిర్వహించారు తిరుపతి ఏఎస్పి రవి మనోహరాచారి సందర్భంగా ఆయన మాట్లాడుతూ....మంగళవారం తొండవాడ బ్రిడ్జి వద్ద తిరుపతి రూరల్ డిఎస్పి బేతంపూడి ప్రసాద్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టడం జరిగిందన్నారు. చంద్రగిరి సీఐ సురేష్ కుమార్, ఎస్సైలు రవి ప్రకాష్ రెడ్డి, అరుణాచలం, సిబ్బందిచే తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు అనుమానితులు పారిపోవడానికి ప్రయత్నించారు. వారిని వెంటాడి పట్టుకోవడం జరిగిందన్నారు వారి వద్ద 22 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. కొంతకాలంగా గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం ఉందని దానిపై నిగా పెట్టడం జరిగిందన్నారు. పట్టుబడిన ఇరువురు యువకులు చంద్రగిరి కి చెందిన షేక్ లాలు, శశి కుమార్ గా గుర్తించామన్నారు. వీరిని తహసిల్దార్ వద్ద ప్రవేశపెట్టి కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. పట్టుబడ్డ యువకులతోపాటు ఈ కేసులో మరో కొంతమందికి ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు వారిని తొందర్లోనే అరెస్టు చేస్తామని వెల్లడించారు.

# చలో పోతిరెడ్డిపాడుకి సిద్ధం కండి - కాకాణి

నెల్లూరు పెన్ పవర్ ఫిబ్రవరి 3.

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల రైతులకు, ప్రజలకు, సాగు, త్రాగునీరు రాకుండా చేస్తున్న అన్యాయానికి వ్యతిరేకంగా ఈ నెల ఫిబ్రవరి 5 తారీకు చేపట్టిన "చలో పోతిరెడ్డిపాడు" కార్యక్రమానికి సంబంధించి నెల్లూరు రూరల్ ఇంచార్జ్ ఆనం విజయ్ కుమార్ రెడ్డి మరియు వైఎస్ఆర్ సీపీ నాయకులతో కలిసి పోస్టర్ ను ఆవిష్కరించిన మాజీ మంత్రివర్యులు మరియు వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు డా.కాకాణి గోవర్ధన్ రెడ్డి రైతులకు, ప్రజలకు జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా, రాయలసీమ ఎత్తిపోతల పథకం సాధన కొరకు ఫిబ్రవరి 5వ తేదీన (గురువారం) ఉదయం 10:00 గం.




లకు నంద్యాల జిల్లా, నందికొట్కూరు నియోజకవర్గం లోని పోతిరెడ్డి పాడు గ్రామం వద్ద సమావేశం నిర్వహించి రాయలసీమ, నెల్లూరు ప్రాంతాలకు జరుగుతున్న అన్యాయాన్ని రాష్ట్ర ప్రజలకు వివరిస్తాం -కాకాణిలి

# శ్రీవారి భక్తుడు మిస్సింగ్.

తిరుపతి, పెన్ పవర్,ఫిబ్రవరి 3.



శ్రీవారి భక్తుడు కనపడకపోవడంతో బంధువుల ఫిర్యాదుతో తిరుపతి ఈస్ట్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కాకినాడ జిల్లా, పత్తిపాడు మండలం,ఉత్తర కంచి పంచాయతీలోని బురడకోట గ్రామానికి చెందిన బుచ్చిరాజు(51) తన కుటుంబంతో శ్రీవారి దర్శనానికి వచ్చాడు. దర్శనానంతరం తిరుపతి రైల్వే స్టేషన్ సమీపంలోని విష్ణు నివాసం వద్దకు చేరుకున్నారు. అయితే తిరుగు ప్రయాణంలో బుచ్చిరాజు కనపడకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుప్రక్కలా వెతికారు. ఎంత వెతికినా బుచ్చిరాజు జాడ కనపడకపోవడంతో ఈస్ట్ పోలీసులు సంప్రదించి ఫిర్యాదు చేశారు. దీంతో ఈస్ట్ ఎస్ఐ ఇమామ్ హుస్సేన్ క్రైమ్ నెంబర్ 82/2026 కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

# బాలుడు ఉరివేసుకొని మృతి.

తిరుపతి, పెన్ పవర్, ఫిబ్రవరి 3.



తిరుపతి నగరంలోని సత్యనారాయణపురంలో 14 ఏళ్ల బాలుడు ఉరివేసుకొని మృతి చెందిన విషాదకర ఘటన మంగళవారం చోటుచేసుకుంది. అలిపిరి పోలీసుల వివరాల మేరకు..... జీవకోనలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి యోగేంద్ర(14) స్కూలుకు వెళ్లకుండా ఉండడంతో యోగేంద్ర అక్క స్కూలుకు వెళ్లలేదని తల్లికి చెబుతానని అనడంతో ఆందోళన గురై తన ఇంటిలోని ఇనుప రాడ్డుకు సున్నిత ఉరివేసుకున్నాడు ఇది గమనించిన అక్క స్థానికులకు తెలుపడంతో హుటా హుటిన ఉరితాడును తొలగించి ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు దీనిపై తల్లి మమత అలిపిరి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు

# ఎమ్మెల్యేను కలసిన పంజాణి తహసీల్దార్



పలమనేరు,పెన్ పవర్, ఫిబ్రవరి 03,

పలమనేరు శాసన సభ్యులు అమరనాథరెడ్డిని పెద్దపంజాణి తహసీల్దార్ రామ్మూర్తి మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు.చౌడేపల్లి డిప్యూటీ తహసిల్దార్ గా పనిచేస్తున్న ఈయన బదలీపై పెద్దపంజాణి మండల తహసీల్దారుగా ఇక్కడికి వచ్చారు. దీంతో విధుల్లో చేరిన అనంతరం మొదటిసారి ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవిన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎమ్మెల్యే ఈ సందర్భంగా ఆయనకు సూచించారు.ఈ కార్యక్రమంలో పలువురు రెవిన్యూ సిబ్బందితో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు ఉన్నారు.



# పెళ్లిరోజు సందర్భంగా గ్రామాలలో బెంచీల ఏర్పాటు



గంగవరం, పెన్ పవర్ ,ఫిబ్రవరి 3:

మండలంలోని నెల్లిపూడి కి చెందిన సి ఆర్ ఎల్ టి ఫౌండేషన్ చైర్మన్ బుడ్డిగ సతీష్ గౌడ్కీర్తి ధనలక్ష్మి దంపతుల పెళ్లిరోజు సందర్భంగా ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పి.రామవరం, నెల్లిపూడి, చిన్నంపాలెం, పిడత మామిడి, గార్లపాడు, గంగవరం గ్రామాలలో ప్రజలకు ఉపయోగపడే విధంగా బెంచీలను ఏర్పాటు చేశారు. గ్రామాల ప్రధాన కూడళ్లలో, బస్టాప్‌ల సమీపంలో మరియు ప్రజలు విశ్రాంతి తీసుకునే ప్రాంతాలలో ఈ బెంచీలను ఏర్పాటు చేయడం వల్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, ప్రయాణికులకు ఇవి ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని గ్రామస్తులు తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా సామాజిక బాధ్యతను చాటుకున్న సతీష్ గౌడ్కీర్తి ధనలక్ష్మి దంపతులను గ్రామ పెద్దలు అభినందించారు.భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# అత్తిలి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. గీతాబాయి



అత్తిలి, పెన్ పవర్, ఫిబ్రవరి 03 :

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గీతాబాయి మంగళవారం అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో అమలవుతున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.ఎంఎల్‌హెచ్పీలు , ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, పీహెచ్‌సీలోనే డెలివరీ కేసులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పీహెచ్‌సీ నుంచి రిఫర్ చేసే కేసులను తప్పనిసరిగా ప్రభుత్వ ఆసుపత్రులకు మాత్రమే తరలించాలని స్పష్టం చేశారు.ఎన్‌సీడీ మరియు సీడీ సర్వేలను కచ్చితంగా, సమగ్రంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పీహెచ్‌సీలో ఓపీకి వచ్చే ప్రతి రోగికి ఆభా ఐడీ సృష్టించబడుతోందా లేదా అన్న అంశంపై ఆరా తీశారు.మధుమేహం (షుగర్), రక్తపోటు (బీపీ) ఉన్న రోగులకు క్రమం తప్పకుండా మందులు అందుతున్నాయా, వారు మందులు సక్రమంగా తీసుకుంటున్నారా అనే విషయాలను కూడా రోగులను అడిగి తెలుసుకున్నారు.ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం తగదని, ప్రభుత్వ ఆరోగ్య పథకాలు ఫీల్డ్ స్థాయిలో సమర్థవంతంగా అమలయ్యేలా సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని డా. గీతాబాయి సూచించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ నాగరాజు, హెచ్ ఈ ప్రమీల దేవి ,హెచ్.వి అమ్మాజీ, వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలీస్ కేసులను ఎదుర్కొంటాం -కాకాణి

నెల్లూరు పెన్ పవన్ ఫిబ్రవరి 3.

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మాజీ మంత్రివర్యులు మరియు వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి పై రెండు కేసులు నమోదు చేసి, నోటీసులు ఇవ్వడానికి వచ్చిన పొదలకూరు పోలీస్ లు పోలీస్ ల రాకకు గల వివరాలు అడిగి తెలుసు కున్న కాకాణి

సోమిరెడ్డి ని దుషించారంటు నమోదైన కేసులో నోటీసులు అందించేందుకు వచ్చామన్న పొదలకూరు పోలీస్ లు.. నమోదైన కేసు మీద,విచారణకు ఈ రోజు సాయంత్రం 5 గంటలకు రావాలని కోరిన పోలీస్ లుకేసు నమోదు చేసేందుకు ఇచ్చిన పిర్యాదు తో సహా ఎఫ్ఐఆర్ కాపీ చూపాలని కోరిన -కాకాణి మీరిచ్చే నోటీస్ ల లో ఏముందో తెలపాలన్న కాకాణి పొదలకూరులో నిర్వహించిన సభలో మీ మీద కేసు కేసు నమోదు అయింది, విచారణకు హాజరు రావాలని తెలిపిన పోలీసులు పొదలకూరులో అక్రమ లేఔట్లకు సంబంధించి నుడా వాళ్ళు పెట్టిన కేసు గురించి చర్యలు ఎందుకు తీసులేదని పోలీస్ లను ప్రశ్నించిన కాకాణి.. నీళ్లు నమిలిన.. పోలీస్లు

సోమిరెడ్డి తో సహా నేను చేసిన ఆరోపణలన్నీ వాస్తవాలే,ఆధారాలతో సహా నిరూపిస్తానన్న-కాకాణిలినోటీసులు తీసుకొని ఈ రోజు సాయంత్రం 4 గంటల లోపల ఎఫ్ఐఆర్ కాపీ తీసుకొస్తే,నేను విచారణకు వస్తానని పోలీసులకు చెప్పిన కాకాణి

కాకాణి స్క్రోలింగ్ పాయింట్స్



# కష్టాల్లో ఉన్నవారికి కొండంత అండగా వేమిరెడ్డి దంపతులు





కోవూరు పెన్ పవర్ ఫిబ్రవరి 3.

నగర పాలక సంస్థ సచివాలయ కార్యదర్శి రఘుకు 3 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. ప్రజాసేవ అంటే కేవలం అభివృద్ధి పనులు చేయడమే కాదు.. ఆపదలో వున్న వారిని ఆదుకోవడంలో తమకు తామే సాటి అని వేమిరెడ్డి దంపతులు నిరూపించారన్నారు నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ పి రూప్ కుమార్ యాదవ్ కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న నెల్లూరు నగరపాలక సంస్థ సచివాలయ కార్యదర్శి రఘు సతీమణి పావనికి వైద్య ఖర్చులు భారమై ఆ కుటుంబం పడుతున్న ఇబ్బందుల గురించి మేయర్ రూప్ కుమార్ ద్వారా తెలుసుకున్న ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రాణాపాయ పరిస్థితిలో వున్న పావనిని ఆదుకోవలసిందిగా తన సతీమణి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి చెప్పడంతోడ

మానవతా దృక్పథంతో స్పందించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి నగరపాలక సంస్థ సచివాలయ కార్యదర్శి రఘుకు 3 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఎంపి ప్రభాకర్ రెడ్డి ఢిల్లీలో వుండడంతో ఆయన సతీమణి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి నగర మేయర్ మరియు కమీషనర్ల సమక్షంలో రఘుకు 3 లక్షలు అందించారు.

ఈ సందర్భంగా ఎంపి నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ పి రూప్ కుమార్ యాదవ్ మాగుంట లే అవుట్ లోని విపిఆర్ నివాసంలో మీడియాతో మాట్లాడుతూ ఎంపి వేమిరెడ్డి దంపతుల దాతృత్వాన్ని కొనియాడారు. వైద్య ఖర్చులు భారమై ప్రాణాపాయ స్థితిలో ఉన్న పావనిని ఆదుకోవడానికి ముందుకు వచ్చిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి, ఎంపీ ప్రభాకర్ రెడ్డి ఆయన ధన్యవాదాలు తెలిపారు. అనంతరం నగరపాలక సంస్థ కమీషనర్ నందన్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగి కుటుంబం పడుతున్న కష్టాన్ని తమ సొంత కష్టంగా భావించి అందుకున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సేవ దృక్పథాన్ని ప్రశంసించారు మానవతమే చిరునాముగా స్పందించి ప్రాణాపాయ స్థాయిలో ఉన్న సచివాలయం ఉద్యోగి సతీమణి వైద్య ఖర్చులకు మూడు లక్షల ఆర్థిక సహాయం అందించిన వేమిరెడ్డి దంపతుల దాతృత్వాన్ని అభినందించారు కష్టకాలంలో కొండంత అండగా నిలిచిన ఏవి రెడ్డి దంపతులకు రఘు కుటుంబం సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో నగర బాలిక సంస్థ అధికారులు మరియు బాధ్యతలు కుటుంబం సభ్యులు పాల్గొన్నారు



# ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మెకు అంగన్వాడీల నోటీసు

పలమనేరు,పెన్ పవర్, ఫిబ్రవరి 03,
దేశవ్యాప్తంగా కేంద్ర బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఫిబ్రవరి 12న జరుగు సమ్మెలో జిల్లాల అంగన్వాడీలందరూ పాల్గొని జయప్రదం చేయాలని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు పద్మ మరియు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి గిరిధర్ గుప్తా పిలుపునిచ్చారు.మంగళవారం పలమనేరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ నందు నాయకులు మాట్లాడుతూ..కేంద్రం నందు బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి12 సంవత్సరాలు గడుస్తున్నా,అంగన్వాడీలకు ఒక రూపాయి కూడా వేతనం పెంచలేదని,నిత్యవసర వస్తువులు ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, కేంద్ర బడ్జెట్ లో నిధులు పెంచలేదని దీనివలన ఐసిడిఎస్ కుంటుపడుతుందని, అంగన్వాడిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్స్ ను బిజెపి ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని కోరుతూ ఈ సమ్మె జరుగుతుందని, ఈ సమ్మెలో అంగన్వాడీ ఉద్యోగులు అందరు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కృష్ణవేణి, విజయమ్మ,విజయరత్న,మమత,రూప,రెడ్డమ్మ, శ్యామల,రాజా,జయంతి,ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

## ఎస్టీ కమిషన్ సభ్యులు వెంకటప్ప



అనంతపురం పెన్ పవర్, ఫిబ్రవరి 03,
అనంతపురం:గిరిజనుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఎస్టీ కమిషన్ సభ్యులు వెంకటప్ప పేర్కొన్నారు. మంగళవారం గుత్తి మండలం ఎర్రగుడి గ్రామంలో గిరిజనులు మరియు ఉన్నత అధికారులతో ఎస్టీ కమిషన్ సభ్యులు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్, గిరిజన సలహా మండలి సభ్యులు వెంకటపతి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాసరావు, ఆర్డీఓ శ్రీనివాస్, డిఎస్పీ, తహసిల్దార్, ఎంపిడిఓ, వివిధ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రగుడి గ్రామ గిరిజనులు కమిషన్ సభ్యులుని ఘనంగా స్వాగతించి సత్కరించారు. అనంతరం స్థానిక గిరిజనులతో వివిధ సమస్యల మీద వినతి పత్రాలు స్వీకరించి, సమస్యల మీద ఉన్నత అధికారులతో చర్చించారు. గిరిజన సమస్యలను అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని అధికారులకు సూచించారు. అధికారులు తమ పరిధిలో ఉన్నటువంటి గిరిజన గ్రామాలలో పర్యటించి వారి సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో అధికారుల మీద శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశం అనంతరం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ మరియు జగదాంబ అమ్మవారిని దర్శించుకుని స్థానికంగా ఉన్న గిరిజన గురుకుల పాఠశాల మరియు కళాశాలను సందర్శించి విద్యార్థులతో చర్చిస్తూ వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మరియు బోధన బోధనేతర సిబ్బంది మరియు గిరిజన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# 33 ఎకరాల స్థలాన్ని ఎమ్మెల్యేతో కలసి పరిశీలించిన ఉన్నతాధికారులు

### - మోడల్ మార్కెట్ ఏర్పాటుకు పడ్డ తొలి అడుగు- అందరి అభిప్రాయాలు సేకరించాలన్న ఎమ్మెల్యే అమర్





పలమనేరు,పెన్ పవర్, ఫిబ్రవరి 03,
పలమనేరు సమీపంలో ఇంటిగ్రేటెడ్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఏర్పాటుకు తొలి అడుగు పడింది.ఆ మేరకు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ గుంటూరు చెందిన డిలైట్ కన్సల్టెన్సీ టీమ్ సభ్యులు, ఉన్నతాధికారులు మంగళవారం ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డితో కలసి క్యాటిల్ ఫామ్ వద్దనున్న 33 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. అదేవిధంగా ప్రస్తుతం ఉన్న మార్కెట్ స్థలాన్ని సైతం అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు.గతవారం క్యాబినెట్లో కొత్త మార్కెట్ ఏర్పాటుకు ఆమోదం తెలుపుతూ మంత్రివర్గం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.దీంతో ఎమ్మెల్యే ఈ అంశంపై ప్రత్యేక చొరవ చూపడంతో మార్కెటింగ్ శాఖ అధికారులు ఇక్కడికి విచ్చేయడం జరిగింది. ఈ సందర్భంగా తొలుత ఎమ్మెల్యే తన కార్యాలయంలో అధికారులతో ఈ విషయమై సమీక్ష నిర్వహించి వారి సందేహాలను నివృత్తి చేశారు.నూతన మార్కెట్ ఏర్పాటుతో ప్రస్తుతం ఉన్న మార్కెట్ స్థలాన్ని ఏ విధంగా అభివృద్ధి చేయాలనే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు.మార్కెట్ తరలింపు అనంతరం ఇక్కడి స్థలంలో కోల్డ్ స్టోరేజిలను ఏర్పాటు చేసి రైతుల పంటలను నిల్వ చేయడమే గాక శుద్ధి అనంతరం ప్యాకింగ్ ప్యాకింగ్ చేసి నేరుగా పెద్ద పెద్ద మాల్స్ కు తరలించేలా ఆలోచన చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ ల నిర్మాణంతో మార్కెట్ కు మంచి ఆదాయం చేకూరతుందని నిర్ణయించారు.ఆ దిశగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని అధికారులు తెలియజేయగా ప్రస్తుతం ఉన్న భవనాలకు అనుగుణంగా అభివృద్ధి జరిగేలా చూడాలని వారికి తెలిపారు. అయితే ఇక్కడి రైతులు మరియు వ్యాపారస్తులు,ప్రజల యొక్క యొక్క అభిప్రాయాలను సైతం పరిగణలోకి తీసుకొని దానికి అనుగుణంగా అభివృద్ధి చేస్తే బాగుంటుందని ఎమ్మెల్యే సూచించారు. తదనంతరం ప్రస్తుత మార్కెట్ యార్డ్ లోని చింతపండు మండీలను పరిశీలించి అక్కడి వ్యాపారులతో అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఏదేమైనా పలమనేరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ త్వరలో అన్నివిధాలా అభివృద్ధిలోకి రానుంది. దీంతో ఈ ప్రాంత రైతులు మరియు వ్యాపారస్తులకు అదే విధంగా ప్రజలకు సైతం మేలు జరగనుందని పలువురు హర్షం వ్యక్తం చేశారు.మార్కెట్ స్థల పరిశీలనకు వచ్చిన వారిలో మార్కెటింగ్ శాఖ ఏడి పరమేశ్వరన్, హార్టికల్చర్ ఏడి కోటేశ్వరరావు, హార్టికల్చర్ ఆఫీసర్ మౌనిక,డిఈఈ వినోద్ కుమార్,గంగవరం తహసిల్దార్ రేఖారెడ్డి, సర్వేయర్ రవికుమార్, ఏఎంసీ సెక్రటరీ సంజీవ్ కుమార్,గుంటూరు డిలైట్ కన్సల్టెన్సీ టీం సభ్యులు రాఘవేంద్ర, వివేక్ లతో పాటు మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న,సింగిల్ విండో చైర్మన్ వెంకటముని రెడ్డి,డైరెక్టర్ నదీమ్ లతోపాటు పలువురు అధికారులు మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# అంబటి రాంబాబు, జోగి రమేష్ లపై భట్టిప్రోలు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు

### టిడిపి రాష్ట్ర కార్యదర్శి - తూనుగుంట్ల సాయిబాబా

బాపట్ల జిల్లా ఇన్చార్జి రేపల్లె నియోజకవర్గ పెన్ పవర్, ఫిబ్రవరి 03,
3.2.26ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లపై వైయస్సార్సీపీ కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ మంత్రి అంబటి రాంబాబు, మరో మాజీ మంత్రి జోగి రమేష్లు ఇటీవల చేసిన అనుచిత వ్యాఖ్యలు పట్ల భట్టిప్రోలు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా మంగళవారం స్థానిక విలేకర్లకు తెలిపారు. సోమవారం సాయంత్రం భట్టిప్రోలు గ్రామములో వందలాది తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో నిరసన ప్రదర్శన చేసి, స్థానిక పోలీసు స్టేషన్ నందు ఫిర్యాదు చేయగా, నిన్నటి రోజు రాత్రి అంబటి రాంబాబు, జోగి రమేష్ లపై భారత న్యాయ సంహిత లోని సెక్షన్స్ 196(1), 352, 351(2) తీ/వర్క్ 3(5) దీచీూ , ప్రకారం బాధ్యతాయుతమైన ఉన్నతమైన పదవుల్లో ఉన్నటువంటి వ్యక్తులు పట్ల, కుటుంబ సభ్యులకు పట్ల బహిరంగ ప్రదేశంలో దుర్భాషలాడి, అనుచిత వ్యాఖ్యలు చేసిన సందర్భంగా కేసు నెం. 19/2026 గా భట్టిప్రోలు సబ్ ఇన్స్పెక్టర్ వీ. శివయ్య నమోదు చేసినట్లు సాయిబాబా తెలిపారు. ఈ మేరకు వేమూరు నియోజకవర్గంలో అంబటి రాంబాబు, జోగి రమేష్లపై అమర్తలూరు పోలీస్ స్టేషన్, కొల్లూరు పోలీస్ స్టేషన్, భట్టిప్రోలు పోలీస్ స్టేషన్లో మూడు ఫిర్యాదులు చేయగా కేసులు నమోదు చేసినట్లు సాయిబాబా తెలిపారు.

# కుష్టు రహిత సమాజంమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ధ్యేయం.

రేపల్లె పెన్ పవర్, ఫిబ్రవరి 03,
జాతీయ కుష్టు నివారణ లో భాగం గా వేమూరు నియోజకవర్గం భట్టిప్రోలు మండలం భట్టిప్రోలు ఏ.ఈ.ఎల్.స్కూలు, పరిసరాల్లో మంగళవారం భట్టిప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారి ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు ర్యాలీలు నిర్వహించి కుష్టు వ్యాధి లక్షణాల ను గుర్తించి వారిని సమాజంలో వివక్షత చూపకుండా గౌరవాన్ని కాపాడటం కుష్టు వ్యాధి నివారణకు సామూహికంగా కృషి చేస్తాము అని విద్యార్థిని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.ఈ కార్య క్రమంలో భట్టిప్రోలు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మంగరాజు, ఏ.ఎన్ ఎం కె కుమారి, ఉపాధ్యాయులు ఆశా కార్యకర్తలు కూరేటి రమాదేవి వెంకటేశ్వరమ్మ,ఎ.గాయత్రి కె. ప్రమీల అంగనవాడి టీచర్లు జాలాది నిర్మల కట్టుపల్లి సుహాసిని ఉన్నారు

# పోటీలలో ప్రతిభను చాటిన టి ఎం రావు విద్యార్థులు.

రేపల్లె పెన్ పవర్, ఫిబ్రవరి 03,
విజ్ఞాన్ బాల మహోత్సవంలో వివిధ రంగాలలో మండల కేంద్రమైన భట్టిప్రోలు తమ్మన మల్లికార్జున రావు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు.సీనియర్ నాటికల పోటీలలో రాష్ట్రస్థాయిలో మూడో స్థానాన్ని పొందారు.సక్రమంగా సెల్ఫోన్ వాడుట అనే నాటికలో యామినీ లత,ప్రణీత సాయి, తిరుపతమ్మ, దయానా,మహాలక్ష్మి లు అబినయించారు. నాటిక రచనా దర్శకత్వం చన్న వెంకట ఉమామహేశ్వరరావు మాస్టర్,సహకారం డి లక్ష్మీపార్వతి అందించారు.ఐఏఎస్ కృష్ణ తేజ చేతుల మీదగా జ్ఞాపిక సర్టిఫికెట్స్,రూ 1000 ల క్యాష్ ప్రైజ్ అందుకున్నా రు.సీనియర్ తెలుగు వక్తృత్వం లో ద్వితీయ స్థానాన్ని దడిగ యామినీ లత కైవసం చేసుకునీ సిల్వర్ మెడల్, సర్టిఫికెట్,రూ 750 ల క్యాష్ ప్రైస్ అందుకుంది.క్లే మౌల్డింగ్ అనే అంశంలో జూనియర్ విభాగంలో త్రినాథ్ మూడవ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు సర్టిఫికెట్,బ్రాంజ్ మెడల్,రూ 500 ల క్యాష్ ప్రైజ్ అందుకున్నాడున. పాఠశాల కరస్పాండెంట్ పులికొండ మల్లికార్జునరావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు చందులూరి రామకోటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయురాలు విష్ణు మొలకల కోటేశ్వరమ్మ,ఎస్ ఎం సి చైర్మన్ సుగుణ కుమారి,లక్ష్మీ పార్వతి, సత్య రత్న,బెల్లంకొండ శ్రీనివాసరావు,చేబ్రోలు శ్రీనివాసరావు మురళీధర్,అనూల్ హక్,రమ్య,దీప్తి తదితర ఉపాధ్యాయులు అభినందించారు.



# రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులను అడ్డుకుని సీఎం చంద్రబాబు నాయుడు సీమకు ఘోరమైన ద్రోహం చేశారు

### పత్తికొండ మాజీ ఎమ్మెల్యే శ్రీమతి కంగాటి శ్రీదేవమ్మ....

పత్తికొండ పెన్ పవర్, ఫిబ్రవరి 03,పెన్ పవర్, ఫిబ్రవరి 03,
పత్తికొండ:రాయలసీమ ప్రాంతానికి జీవనాడిగా ఉన్న ఎత్తిపోతల పథకం పనులను వెంటనే పునఃప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5వ తేదీన పోతిరెడ్డిపాడు వద్ద నిర్వహించనున్న బహిరంగ సభకు వైఎస్ఆర్ పార్టీ నాయకులు, రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా పత్తికొండలోని తన స్వగృహంలో వైఎస్ఆర్ పార్టీ రాష్ట్ర కమిటీ నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ,రాయలసీమ రైతులను ఆదుకోవాలనే సంకల్పంతో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి గారు ఎత్తిపోతల పథకానికి రూపకల్పన చేశారని, వైఎస్సార్సీపీ ప్రభుత్వం 2022లో ఈ పథకాన్ని ప్రారంభించి 80 శాతం కంటే ఎక్కువ పనులు పూర్తి చేసిందని తెలిపారు. కానీ 2024లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రాజకీయ కక్షతో రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులను నిలిపివేసి రైతుల ఆశలను నీరుగార్చిందని, ఇది సీమ ప్రజలపై చేసిన ఘోరమైన అన్యాయమని మండిపడ్డారు.రాయలసీమకు నీళ్లు రావడం చంద్రబాబుకు ఇష్టం లేకనే ఈ పథకాన్ని అడ్డుకుంటున్నారని ఆరోపించారు.రాయలసీమ హక్కుల కోసం వైఎస్ఆర్ పార్టీ చివరి వరకు పోరాడుతుందని, ప్రజలు, రైతులు ఐక్యంగా ఉద్యమంలో పాల్గొని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ గారు పిలుపునిచ్చారు.ఈ పత్రిక సమావేశంలో రాష్ట్ర కమిటీ నాయకులు,ఎంపీపీ, మండల కన్వీనర్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు, జిల్లా కమిటీ నాయకులు,పత్తికొండ మండల సర్పంచులు,ఎంపిటిసిలు, మైనారిటీ నాయకులు, పాల్గొన్నారు.

# కలుగొట్ల గ్రామంలో కొండమ్మ వాగు చెరువును సందర్శించిన ఎమ్మెల్యే

### రాయలసీమలో నీటి కొరతలేదనిక్షేత్రస్థాయిలోవాస్తవాలువెల్లడించిన ఎమ్మెల్యే.బీవీజయనాగేశ్వర్ రెడ్డి

ఎమ్మిగనూరు ఫిబ్రవరి 3 పెన్ పవర్, ఫిబ్రవరి 03,
ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామ పరిధిలోని కొండమ్మ వాగు చెరువును ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి నీటి సంఘాల ప్రతినిధులు, రైతులు, స్థానిక టీడీపీ నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా చెరువులో నీటి లభ్యత, సాగునీటి వినియోగం, సాగు కార్యకలాపాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రాయలసీమలో నీటి కొరత ఉందని వైసీపీ చేస్తున్న ప్రచారం పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనదే తప్ప వాస్తవాలకు దూరమని స్పష్టం చేశారు ప్రస్తుతం రాయలసీమ ప్రాంతంలో ఉన్న లికాలువలు, చెరువులు, రిజర్వాయర్లు, లిఫ్ట్ సాగునీటి వ్యవస్థల ద్వారా రైతులకు సరిపడా సాగునీరు అందుబాటులో ఉందనిపేర్కొన్నారు.రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ను వెంటనే పునఃప్రారంభించాల్సిందే అన్న వైసీపీ వాదన, ఇప్పటికే పనిచేస్తున్న పలు సాగునీటి ప్రాజెక్టులను విస్మరించడం తప్ప మరొకటి కాదన్నారు. గత వైసీపీ పాలనలో సాగునీటి పనులను నిలిపివేసి, తరువాత రాజకీయ లాభాల కోసం ఆందోళనలు చేశారని విమర్శించారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతుల ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తూ, రూ.12,441 కోట్ల విలువైన సాగునీటి పనులను అమలు చేసి, పునరుద్ధరించి, రైతులకు నీటి భరోసా కల్పించిందనితెలిపారు. ఇది నినాదాల రాజకీయమా లేక క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న నీటిమట్టాలు, సాగు భూములా అన్నది ప్రజలే గమనిస్తున్నారని అన్నారు. ఇది మాటల పోరాటం కాదుఇది కనిపిస్తున్న నీరు, సాగుతున్న పొలాలు, రైతుల నమ్మకం వర్సెస్ రాజకీయంగా సృష్టించిన కల్పిత సంక్షోభం అని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నీటి సంఘాల ప్రతినిధులు, రైతులు, కూటమి నేతలు, స్థానిక టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు





# దాడుల- ప్రతి దాడుల సంస్కృతా...

**విజయవాడ, ఫిబ్రవరి 3, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గత కొన్నేళ్లుగా సాగుతున్న "దాడులు-ప్రతిదాడుల" సంస్కృతిలో ఒక కీలక మార్పు కనిపిస్తోంది. మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత జోగి రమేశ్ నివాసంపై జరిగిన దాడి ఉదంతం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. అయితే, ఈ ఘటనలో చర్చనీయాంశం దాడి మాత్రమే కాదు.. ఆ దాడి జరిగిన తర్వాత ప్రస్తుత ప్రభుత్వం స్పందించిన తీరు, తీసుకున్న నిర్ణయాలు విశ్లేషకులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి.టీడీపీ యువనేత, ప్రస్తుత మంత్రి నారా లోకేశ్‌పై జోగి రమేశ్ గతంలో చేసిన కొన్ని అనుచిత వ్యాఖ్యలు టీడీపీ శ్రేణుల్లో తీవ్ర ఆగ్రహాన్ని కలిగించాయి. ఈ నేపథ్యంలోనే ఆగ్రహంతో ఊగిపోయిన కొందరు టీడీపీ కార్యకర్తలు, నేతలు జోగి రమేశ్ ఇంటిపై దాడికి దిగారు. కేవలం నినాదాలకే పరిమితం కాకుండా, రాళ్లు రువ్వడం, పెట్రోల్ బాటిళ్లు విసిరి మంటలు రాజేయడం వంటి తీవ్రస్థాయి చర్యలకు పాల్పడ్డారు. ఇది శాంతిభద్రతల పరంగా పెద్ద చర్చకు దారితీసింది.సాధారణంగా అధికార పార్టీ కార్యకర్తలు ప్రతిపక్ష నేతలపై దాడులు చేసినప్పుడు, ప్రభుత్వం వారిని వెనకేసుకొస్తుందనే ముద్ర భారత రాజకీయాల్లో బలంగా ఉంది. కానీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయంలో భిన్నమైన వైఖరిని ప్రదర్శించారు. ఈ దాడి ఘటనను ఆయన తీవ్రంగా పరిగణించడమే కాకుండా, "చట్టం ఎవరికైనా ఒక్కటే.. తప్పు చేసిన వారు మన పార్టీ వారైనా సరే కేసులు నమోదు చేయాల్సిందే" అని పోలీసులను ఆదేశించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. సీఎం ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసులు 40 మంది టీడీపీ నేతలపై కేసులు నమోదు చేశారు. వీరిలో 11 మంది కీలక నేతలను అరెస్ట్ చేసి ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిబంధనల ప్రకారం వారికి స్టేషన్ బెయిల్ మంజూరు కావడంతో విడుదలయ్యారు, కానీ చట్టపరమైన ప్రక్రియను మాత్రం ప్రభుత్వం అడ్డుకోలేదు.ఈ ఘటనను విశ్లేషిస్తున్న వారు సహజంగానే గత జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ వైఖరితో పోల్చుతున్నారు. టీడీపీ నేతలు ప్రధానంగా రెండు అంశాలను ఇక్కడ గుర్తు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై వైసీపీ శ్రేణులు దాడి చేసినప్పుడు, బాధ్యులపై చర్యలు తీసుకోవడం మాట అటుంచి, తిరుగుబాటు చేసిన టీడీపీ నేతలపైనే రివర్స్ కేసులు నమోదయ్యాయని వారు ఆరోపిస్తున్నారు. గతంలో అసభ్య పదజాలంతో ప్రత్యర్థులను దూషించిన వారికి పదవులు కట్టబెట్టడం ద్వారా వైఎస్సార్సీపీ "అరెస్టుల కంటే అభినందనలకే" ప్రాధాన్యత ఇచ్చిందని టీడీపీ నేతలు విమర్శిస్తున్నారు. దీనికి భిన్నంగా, ఇటీవల వై.ఎస్. భారతిని అసభ్య పదజాలంతో దూషించిన ఐటీడీపీ కార్యకర్తపై చంద్రబాబు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని, జైలుకు పంపించడం ద్వారా "తప్పు ఎవరి వైపు ఉన్నా క్షమించేది లేదని" సంకేతాలు పంపినట్లయింది.ఒక ప్రభుత్వం తన సొంత కార్యకర్తలపై కేసులు పెట్టడం అనేది రాజకీయంగా సాహసోపేతమైన నిర్ణయమే. దీనివల్ల క్యాడర్‌లో కొంత అసంతృప్తి కలిగే అవకాశం ఉన్నప్పటికీ, సాధారణ ప్రజల్లో ప్రభుత్వ ప్రతిష్ట పెరుగుతుంది. "రాజకీయాల్లో విమర్శలు ప్రతివిమర్శలు సహజం. కానీ అవి భౌతిక దాడుల వరకు వెళ్లినప్పుడు ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరించకపోతే సమాజంలో అరాచకం పెరుగుతుంది.


03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


## అంబటి వ్యాఖ్యలపై చర్చ...

**గుంటూరు ఫిబ్రవరి 3, పెన్ పవర్:** వైసీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇటీవల నడిరోడ్డుపై మీడియా ముందే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పై తీవ్ర వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా పెద్ద చర్చకు దారి తీసింది. సభ్యసమాజం ఆమోదించలేని పదజాలంతో చేసిన ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయ వాతావరణాన్ని మరింత ఉద్రిక్తంగా మార్చాయి. అధికారంలో ఉన్న సమయంలో ఇదే తరహా వ్యాఖ్యలు టీడీపీ నేతల నుంచి వచ్చి ఉంటే ఎలా స్పందించేవారు అన్న అంశం ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది. టీడీపీ నేత కొమ్మారెడ్డి పట్టాభి జగన్ మోహన్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో అర్ధరాత్రి అరెస్ట్ జరిగిన ఉదంతాన్ని పలువురు గుర్తు చేస్తున్నారు. ఆ సందర్భాన్ని ఇప్పుడు అంబటి వ్యవహారంతో పోలుస్తూ, చట్టం అందరికీ సమానంగా వర్తించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో అంబటి వ్యాఖ్యలను సమర్థించే పరిస్థితి వైసీపీలోనే కనిపించడం లేదు. పార్టీ అధినేత తప్ప ఇతర నాయకులు బహిరంగంగా మద్దతు పలకకపోవడం గమనార్హం.వైసీపీలోని పలువురు నేతలు ఆఫ్ ది రికార్డ్‌గా మాట్లాడుతూ, అంబటి మాట తీరు ఎప్పటి నుంచో ఇలాగే ఉందని, గతంలో కూడా అనేకసార్లు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని అంటున్నారు. కొందరు నేతలు ఆయన ప్రవర్తన పార్టీకి నష్టం కలిగిస్తోందని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీంతో అంబటి వ్యవహారం వ్యక్తిగత అంశం కాదని, పార్టీ అంతర్గత సమస్యల ప్రతిబింబంగా మారిందనే అభిప్రాయం వినిపిస్తోంది.అసలు అంబటి ఈ స్థాయిలో స్పందించడానికి కారణాలేంటి అన్నది మరో కీలక అంశంగా మారింది. బహిరంగంగా చెబుతున్నట్లు టీడీపీ శ్రేణులు ఆయన కారును అడ్డుకోవడమే కారణం కాదని, వైసీపీలోని కొందరు నాయకులే అంటున్నారు. ఇటీవల సత్తెనపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ పదవి నుంచి అంబటిని తప్పించడంతో ఆయనకు పార్టీలో ప్రాధాన్యం తగ్గిందనే భావన పెరిగిందని చెబుతున్నారు. ఇదే సమయంలో ఆయనపై కేసులు నమోదవడం, పార్టీ నుంచి సరైన సహకారం లేకపోవడం కూడా అసంతృప్తికి కారణమైందని అంటున్నారు.ఈ అన్ని అంశాల సమ్మేళనమే అంబటి కోపంగా బయటపడడానికి దారితీసిందని రాజకీయ వర్గాల విశ్లేషణ. ఈ ఘటనతో పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిందని, వైసీపీలో అంతర్గత అసంతృప్తి బయటకు వస్తోందనే చర్చ జరుగుతోంది. ఒక్క అంబటే కాకుండా మరికొందరు నాయకులు కూడా ఇదే తరహా ఆగ్రహంతో ఉన్నప్పటికీ, కొందరు సంయమనం పాటిస్తుండగా మరికొందరు బహిరంగంగా స్పందిస్తున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. మొత్తంగా ఈ పరిణామాలు వైసీపీ భవిష్యత్ రాజకీయ దిశపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

## ఎంపీల పనితీరుపై సమగ్ర నివేదికలు

**గుంటూరు ఫిబ్రవరి 3, పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీలో సంస్థాగత క్రమశిక్షణను మరింత బలోపేతం చేసే దిశగా కీలక అడుగులు పడుతున్నాయి. ఇప్పటివరకు ఎమ్మెల్యేలు, మండల స్థాయి నాయకులకు బాధ్యతలు అప్పగిస్తూ వారి పనితీరును సమీక్షించిన పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు , జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఇప్పుడు అదే విధానాన్ని ఎంపీలకూ వర్తింపజేయాలని నిర్ణయించారు. ప్రజలతో నేరుగా అనుసంధానం పెంచడం, సమస్యల పరిష్కారంలో వేగం తీసుకురావడం ఈ చర్యల వెనుక ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తోంది.ఈ నిర్ణయానికి అనుగుణంగా ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో ఇప్పటివరకు ఎదురైన సమస్యలు, గత 15 నెలల కాలంలో పరిష్కరించిన అంశాలపై ఎంపీలు సమగ్ర నివేదికలు ఇవ్వాల్సి ఉంటుందని పార్టీ ఆదేశించింది. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు ఎలా పరిష్కారమయ్యాయి, ఇంకా పెండింగ్‌లో ఉన్నవి ఏవి అనే వివరాలను స్పష్టంగా పొందుపరచాలని సూచించింది. దీనితో పాటు పార్లమెంటు సమావేశాల్లో ఎంపీలు ప్రస్తావించిన అంశాలు, వాటికి కేటాయించిన సమయం, ఆ చర్చల వల్ల నియోజకవర్గానికి వచ్చిన ప్రయోజనాలు వంటి విషయాలనూ వివరించాలని కోరుతోంది.ఇకపై ఎమ్మెల్యేలతో నిర్వహిస్తున్న ముఖాముఖి సమావేశాల మాదిరిగానే ఎంపీలతో కూడా నేరుగా సమావేశాలు నిర్వహించేందుకు పార్టీ సిద్ధమవుతోంది. ఈ సమావేశాల్లో ప్రజలతో నాయకులు ఎలా మమేకమవుతున్నారు, క్షేత్రస్థాయిలో వారి పాత్ర ఎంత ప్రభావవంతంగా ఉంది అనే అంశాలను ప్రత్యేకంగా పరిశీలించనున్నారు. సమస్యల పరిష్కారంలో చూపిస్తున్న చొరవ, ప్రజల మధ్య గడుపుతున్న సమయం, పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం వంటి విషయాలు ఈ సమీక్షలో కీలకంగా మారనున్నాయి.వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రజల మూడ్ ఎలా మారుతోంది అనే అంశాన్ని కూడా పార్టీ గమనిస్తోంది. అందుకు తగ్గట్టుగా నాయకుల పనితీరును మలచాలనే ఆలోచనతో ఈ సమీక్షా విధానాన్ని అమలు చేస్తున్నారు. ముఖ్యంగా ఎంపీలు, ఎమ్మెల్యేల మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న అంతర్గత విభేదాలు పార్టీకి నష్టం కలిగిస్తున్నాయని అంచనా వేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి వివాదాలకు తావు లేకుండా స్పష్టమైన బాధ్యతలు, సమన్వయం ఉండాలనే లక్ష్యంతో ఈ చర్యలు తీసుకుంటున్నారు. నారా లోకేష్ నేతృత్వంలో పార్టీ భవిష్యత్తు వ్యూహాలు రూపొందుతున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎంపీలతో ప్రత్యక్ష సమావేశాల ద్వారా వారు ఎదుర్కొంటున్న సంస్థాగత సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలన్నది ప్రధాన ఉద్దేశ్యం. ఈ విధానంతో నియోజకవర్గ స్థాయిలో పార్టీ బలం పెరుగుతుందని, నాయకత్వంపై ప్రజల విశ్వాసం మరింత బలపడుతుందని ఆశిస్తున్నారు. ఎంపీలను కూడా క్రమశిక్షణతో పనిచేసేలా "లైన్‌లో" పెట్టాలన్న ఈ ప్రయత్నం ఎంతవరకు విజయవంతమవుతుందో రాబోయే రోజుల్లో స్పష్టమవుతుందని రాజకీయ వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి.

## మళ్లీ పడిపోయిన టమాటా ధరలు

**తిరుపతి, ఫిబ్రవరి 3, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో మరోసారి టమాటా ధరలు భారీగా పడిపోయాయి. పంటను మార్కెట్‌లకు తీసుకొచ్చిన రైతులు ధరలు పతనం కావడంతో ఆందోళనలో ఉన్నారు. కనీసం కోత, రవాణా ఖర్చులకు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది రైతులు టమాటా కోతను వాయిదా వేశారు. రాష్ట్రంలోని మార్కెట్‌లలో మరీ దారుణంగా కేజీ టమాటా ధర రూ.5 నుంచి రూ.10లోపే ఉందని చెబుతున్నారు రైతులు.చాయ్ కంటే చీప్.. కేజీ రూ.10లోపే.. ఇది ఏపీలో టమాటా సాగు చేసిన రైతుల పరిస్థితి. గతేడాది కొన్ని నెలల పాటూ సిరులకు కురిపించి టమాటా ధరలు.. ఇప్పుడు మాత్రం దారుణంగా పడిపోయాయి. మార్కెట్‌లలో కేజీ టమాటా ధర రూ.5 నుంచి రూ.10లోపే ఉంది. ఈ ధరలు దారుణంగా పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. టమాటా కోత, రవాణా చేసినందుకు అయ్యే ఖర్చు కూడా మిగలడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటను మార్కెట్‌కు తరలించినా ఉపయోగం లేకుండా పోతోంది అంటున్నారు. ఒక్కసారిగా ధరల పడిపోవడంతో ఆందోళనలో ఉన్నారు. అయితే జనాలు మాత్రం టమాటా ధరలు తగ్గిపోవడంతో పండగ చేసుకుంటున్నారు.జనవరి మొదటి వారంలో టమాటాలు కేజీ రూ.10 నుంచి రూ.20 మధ్య పలికాయి. ఇప్పుడేమో దారుణంగా కేజీ రూ.5 నుంచి రూ.10 మధ్య పలుకుతున్నాయి. అయితే వ్యాపారులు రిటైల్‌గా కేజీ రూ.15 నుంచి రూ.20కు టమాటాను విక్రయిస్తున్నారు. కానీ దారుణంగా రైతుల నుంచి మాత్రం తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. టమాటా పంట నాణ్యత సరిగా లేకపోవడంతోనే ధరలు తగ్గాయంటున్నారు వ్యాపారులు. మార్కెట్‌కు వస్తున్న సరుకు మొదట్లో వచ్చినంత నాణ్యత లేదని.. అందుకే తిరస్కరిస్తున్నట్లు చెబుతున్నారు.రైతులు మాత్రం వ్యాపారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ క్రమంలో మార్కెట్లకు వచ్చే టమాటా పంట కూడా తగ్గింది అంటున్నారు. టమాటా ధరలు దారుణంగా పడిపోవడంతో చాలామంది రైతులు కాయల్ని కోసే సాహసం చేయడం లేదు. ఇటీవల టమాటా సాగు చేసిన రైతులది కూడా ఇదే పరిస్థితి. టమాటా సాగు కోసం భారీగా పెట్టుబడులు పెట్టామని.. ఇప్పుడు ధరలు తగ్గడంతో కనీసం ఖర్చులకు కూడా డబ్బులు రావడం లేదంటున్నారు. చాలామంది రైతులు అప్పులబారిన పడుతున్నారట. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని రైతులకు గిట్టుబాటు ధరల దక్కేలా న్యాయం చేయాలని కోరుతున్నారు. కొందరు రైతులు మాత్రం ధరలను చూసి పొరుగు జిల్లాల్లో మార్కెట్‌లకు తరలిస్తున్నారట. అక్కడైనా సరైన దొరకుతుందనే ఆశతో ఇలా చేస్తున్నారట. మొత్తానికి టమాటా ధరలు తగ్గడంతో రాష్ట్రంలో రైతులు కష్టాల్లో ఉన్నారు

# బంగారం భద్రతా సాధనమా?


**హైదరాబాద్ పెన్ పవర్:** భారతీయ సామాజిక ఆర్థిక వ్యవస్థలో బంగారం అనేది కేవలం విలువైన లోహం మాత్రమే కాదు, అది ఒక సాంస్కృతిక మూలధనం, సామాజిక ప్రతిష్ఠా సూచిక, ఆర్థిక భద్రతా సాధనంగా బలంగా స్థిరపడిపోయింది. ముఖ్యంగా వివాహాలు, పండుగలు, కుటుంబ పరంపరలు వంటి సందర్భాల్లో బంగారం వినియోగం ఒక అనివార్య ఆచారంలా మారింది. అయితే ఇటీవలి కాలంలో బంగారం ధరల్లో చోటుచేసుకుంటున్న అసాధారణ పెరుగుదల, వ్యక్తిగత కుటుంబాల స్థాయిని మించి, సమగ్ర జాతీయ ఆర్థిక వ్యవస్థపై కూడా దీర్ఘకాలిక ప్రతికూల ప్రభావాలను మోపుతోంది. మధ్య తరగతి జీవితంలో బంగారం ధరల పెరుగుదల ఒక రకమైన వినియోగ ఒత్తిడిను సృష్టిస్తోంది. స్థిర ఆదాయం ఉన్నప్పటికీ పెరుగుతున్న ద్రవ్యోల్బణం, ఆరోగ్య వ్యయాలు, విద్యా ఖర్చులు వంటి అంశాల మధ్య బంగారం కొనుగోలు అనేది ఒక ఆర్థిక విరోధాభాసంగా మారింది. బంగారం కొనాలనే సామాజిక అంచనాలు ఒకవైపు, కొనలేని ఆర్థిక వాస్తవాలు మరోవైపు ఉండడం వల్ల మధ్యతరగతి కుటుంబాలు తీవ్రమైన మానసిక, ఆర్థిక ఒత్తిడికి లోనవుతున్నాయి. బంగారం ధరల పెరుగుదల ప్రభావం అత్యంత తీవ్రంగా పడేది ఆడపిల్ల తల్లిదండ్రుల మీదనే. భారతీయ సమాజంలో ఇంకా పూర్తిగా నిర్మూలించబడని కట్న భావజాలం, సామాజిక పోటీ ధోరణి, పరువు ప్రతిష్ఠల పట్ల అతిగా ఆలోచించే మనస్తత్వం కలసి, ఒక ఆడపిల్ల తండ్రిని, తల్లిని ఒక సాంఘిక బాధ్యతా సంక్షోభంలోకి నెట్టేస్తున్నాయి. కుమార్తె వివాహం అనగానే ఆభరణాలు, కట్నం, ఆడంబర ఖర్చులు అనే భావన తల్లిదండ్రుల మనసులో సహజంగానే కలుగుతోంది. ఈ భారం కోసం తల్లిదండ్రులు తమ జీవితకాలపు పొదుపును ఖర్చు చేయడమే కాకుండా, బ్యాంకు రుణాలు, ప్రైవేట్ అప్పులు, బంగారం తాకట్టు వంటి మార్గాలను ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా వారు ఒక అప్పుల చట్రంలో చిక్కుకుని, వివాహం పూర్తయిన తర్వాత కూడా సంవత్సరాల తరబడి ఆర్థిక భారాన్ని మోస్తూ జీవించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఇది కేవలం ఆర్థిక సమస్య కాదు, ఇది తల్లిదండ్రుల మానసిక ఆరోగ్యంపై కూడా తీవ్రమైన ప్రభావం చూపించే ఒక మానసిక ఒత్తిడి సంక్షోభంగా మారుతోంది. సంపన్న వర్గాల దృష్టిలో మాత్రం బంగారం ఒక హెడ్జింగ్ సాధనంగా పనిచేస్తోంది. ద్రవ్యోల్బణం, మార్కెట్ అస్థిరత, స్టాక్ మార్కెట్ పతనం వంటి పరిస్థితుల్లో బంగారం ఒక భద్రమైన పెట్టుబడిగా మారుతుంది. ధరలు పెరిగే కొద్దీ వారి సంపద విలువ కూడా పెరుగుతూ, ఇది ఒక సంపద విస్తరణ యంత్రాంగంగా పనిచేస్తోంది. దీని వల్ల సామాజిక, ఆర్థిక, అసమానతలు మరింత లోతుగా పెరుగుతున్నాయి. సమగ్ర ఆర్థిక వ్యవస్థ పరంగా చూస్తే, బంగారం ధరల పెరుగుదల దేశానికి తీవ్రమైన దిగుమతి భారాన్ని కలిగిస్తోంది. భారతదేశం ప్రపంచంలో అగ్రస్థానంలో ఉన్న బంగారం దిగుమతి దేశం కావడం వల్ల, ధరలు పెరిగినప్పుడు విదేశీ మారకద్రవ్య నిల్వలపై తీవ్ర ఒత్తిడి ఏర్పడుతుంది. ఇది చెల్లింపుల సమతుల్యత లోటును పెంచి, రూపాయి విలువను బలహీనపరుస్తుంది. రూపాయి బలహీనపడిన కొద్దీ దిగుమతుల ఖర్చు మరింత పెరిగి, ద్రవ్యోల్బణం మరోసారి తీవ్రమవుతుంది. ఇది ఒక ఆర్థిక దుష్చక్రంగా మారుతుంది. ఇంకా ముఖ్యమైన అంశం ఏమిటంటే, బంగారంపై అధిక పెట్టుబడి పెట్టడం వల్ల దేశంలో ఉత్పాదక మూలధనం క్షీణిస్తోంది. పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, స్టార్టప్‌లు, సాంకేతిక రంగాల్లో పెట్టుబడి పెట్టాల్సిన డబ్బు బంగారం రూపంలో నిల్వ అయి, ఆర్థిక వృద్ధి రేటును దీర్ఘకాలంలో మందగించే ప్రమాదాన్ని కలిగిస్తోంది. ఇది దేశానికి ఒక అవుట్‌పుట్ గ్యాప్‌ను సృష్టిస్తోంది. ప్రభుత్వ వైఖరి విషయానికి వస్తే, బంగారం ధరలను నేరుగా నియంత్రించడం సాధ్యం కాకపోయినా, దిగుమతి సుంకాలు, జిఎస్‌టి, సావరిన్ గోల్డ్ బాండ్లు వంటి విధానాల ద్వారా ప్రజలను భౌతిక బంగారం కొనుగోలు నుంచి దూరం పెట్టే ప్రయత్నం చేస్తోంది. ఇది ఒక రకమైన విధానాత్మక హస్తక్షేపం. కానీ సామాజిక మానసికత మారకుండా, కేవలం విధానాలతో సమస్య పరిష్కారం సాధ్యం కాదు. భవిష్యత్తులో బంగారం ధరలు ఇలాగే పెరుగుతూ ఉంటే, మధ్యతరగతి సమాజంలో ఆర్థిక అస్థిరత, వినియోగ సామర్థ్యంలో తగ్గుదల, అప్పుల భారంతో కూడిన జీవితం వంటి పరిణామాలు చోటుచేసుకుంటాయి. దీర్ఘకాలంలో ఇది ఒక తరతరాల పేదరిక చట్రంగా మారే ప్రమాదం ఉంది.

నివారణ

మార్గాలుగా ముందుగా సామాజిక దృక్పథంలో మార్పు అవసరం. కట్నం, ఆడంబర వివాహాలను సామాజికంగా నిరుత్సాహపరచాలి. బంగారాన్ని గౌరవానికి ప్రమాణంగా కాకుండా, ఒక సాధారణ పెట్టుబడి సాధనంగా మాత్రమే చూడాలి. ప్రజలు మ్యూచువల్ ఫండ్లు, పెన్షన్ పథకాలు, సావరిన్ గోల్డ్ బాండ్లు వంటి ప్రత్యామ్నాయ పెట్టుబడి మార్గాలను ఎంచుకోవాలి. ప్రభుత్వం ఆర్థిక విద్యను పాఠశాల స్థాయి నుంచే ప్రవేశపెట్టి, ప్రజల్లో ఆర్థిక అవగాహన పెంచాలి. ముగింపుగా, బంగారం ధరల పెరుగుదల అనేది కేవలం మార్కెట్ పరిణామం కాదు, అది ఒక వ్యవస్థాత్మక ఆర్థిక హెచ్చరిక. దీన్ని సమాజం సమయానుకూలంగా గ్రహించకపోతే, మధ్యతరగతి మాత్రమే కాదు, జాతీయ ఆర్థిక వ్యవస్థ కూడా దీర్ఘకాలంలో తీవ్ర ఒత్తిడికి లోనయ్యే అవకాశం ఉంది. బంగారం కంటే విలువైనది మన మానవ మూలధనం, ఆర్థిక అవగాహన, సామాజిక సంస్కరణలే అన్న సత్యాన్ని గుర్తించడమే నిజమైన పరిష్కారం.

# లోకల్ బాడీ ఎలక్షన్స్ కు వడివడిగా అడుగులు

**విశాఖపట్టణం, ఫిబ్రవరి 3, పెన్ పవర్:**
ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలకు నగారా మోగనుందా? వరుసగా ఎన్నికలు రానున్నాయా? ముందుగా సర్పంచ్ ఎన్నికలను పూర్తి చేయనున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. అయితే రాష్ట్రంలో ముందుగా మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం ముగియనుంది. మార్చి 17తో మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం ముగియనుంది. సర్పంచ్ల పదవీకాలం ఏప్రిల్ 4 తో ముగియనుంది. ఎంపీటీసీలతో పాటు జడ్పిటిసి లకు సంబంధించిన పదవీకాలం జూన్ వరకు ఉంది. ఈ తరుణంలో స్థానిక సంస్థల ఎన్నికలకు ఎన్నికల కమిషన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి నీలం సాహ్ని సిద్ధమని ప్రకటించారు. జిల్లాల యంత్రాంగాలను సిద్ధం చేశారు. ఓటర్ల జాబితా, రిజర్వేషన్ల రూపకల్పన వంటివి ఇప్పటికే దాదాపు ఒక కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఈ దూకుడు చూస్తుంటే మే నెలలో పంచాయితీ, అక్కడ కొద్ది రోజులకే మున్సిపాలిటీ, ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికలను పూర్తిచేసేందుకు ఎన్నికల కమిషన్ అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అర్థమవుతోంది.మరోవైపు రాజకీయ పరిస్థితులను చూస్తుంటే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో సంతృప్తి శాతం ఉంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆశించిన స్థాయిలో పుంజుకోలేదు. ఇటువంటి సమయంలో స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేస్తే.. మూడు పార్టీల మధ్య పదవుల సర్దుబాటు చేస్తే.. వచ్చే మూడేళ్లలో మూడు పార్టీల శ్రేణులు సమన్వయంతో పనిచేస్తాయి. అందుకే వీలైనంత త్వరగా స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు




సమాచారం. ఇప్పటికే మూడు పార్టీల నాయకత్వాలు తమ పార్టీల శ్రేణులకు స్పష్టమైన ఆదేశాలు కూడా ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే బలం ఉన్నచోట మాత్రమే అభ్యర్థులను రంగంలోకి దించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు ప్రచారం నడుస్తోంది. ప్రజల్లో బలం ఉన్న పార్టీలకు అవకాశం కల్పిస్తారని తెలుస్తోంది. ఒక్క మాటలో చెప్పాలంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంత మాత్రం బలపడకుండా చూడాలని కూటమి భావిస్తున్నట్లు సమాచారం.అయితే ఈనెల 20 తరువాత దేశవ్యాప్తంగా తొలి విడత జన గణన మొదలవుతుంది. సుమారు ఏడాదిన్నర ఈ ప్రక్రియ కొనసాగనుంది. ఈ లెక్కన 2027 లోనే ఎన్నికలు జరపాల్సి ఉంటుంది. అయితే 2018లో చంద్రబాబు చేసిన తప్పిదం అదే. అప్పట్లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు చంద్రబాబు ఆసక్తి చూపలేదు. 2019 ఎన్నికల్లో ఆ ప్రభావం కనిపించింది. ఇప్పుడు జనాభా గణ న అంటూ వాయిదా వేస్తే మాత్రం కూటమి పార్టీలకు ఇబ్బంది కరం.. పైగా స్థానిక సంస్థల ఎన్నికలకు కులగణన అనేది అడ్డంకి కాదు. ఎందుకంటే ఆర్థిక సంఘం నిధులన్నీ స్థానిక సంస్థల పాలకవర్గాల తోనే సంబంధం ఉంటుంది. పాలకవర్గాలు ఉంటేనే ఆర్థిక సంఘం నిధులు విడుదలవుతాయి. అయితే ఈ పరిణామాలన్నీ చూస్తుంటే మాత్రం వేసవిలో స్థానిక సంస్థల ఎన్నికలు ఖాయం. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# ఒంటరితనమే విజయ రెడ్డి విషాదానికి కారణమా?

**హైదరాబాద్, ఫిబ్రవరి 3, పెన్ పవర్:**
హైదరాబాద్ చర్లపల్లిలో సాఫ్ట్ వేర్ ఇంజినీర్ విజయ రెడ్డి తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకున్న ఘటన సమాజాన్ని ఉలిక్కిపడేలా చేసింది. అన్నీ ఉన్నా అనురాగం పంచే వారు దగ్గర లేరన్న ఆవేదన, ఒంటరితనం ఒక నిండు ప్రాణాన్ని, ఇద్దరు చిన్నారుల భవిష్యత్తును చిదిమేసింది.సాధారణంగా ఆత్మహత్యల వెనుక ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు లేదా తీవ్ర అనారోగ్యం వంటి కారణాలు కనిపిస్తాయి. కానీ, చర్లపల్లిలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ విజయ రెడ్డి (40) తన ఇద్దరు పిల్లలతో కలిసి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన వీటన్నింటికీ భిన్నంగా కనిపిస్తోంది. విజయ రెడ్డి విద్యావంతురాలు, సమాజంలో మంచి గౌరవం ఉన్న వృత్తిలో ఉన్నారు. భర్త దుబాయ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడ్డారు. ఆర్థికంగా ఎటువంటి లోటు లేదు. కానీ, ఆమె తీసుకున్న ఈ కఠిన నిర్ణయం ఇప్పుడు అనేక సామాజిక, మానసిక ప్రశ్నలను లేవనెత్తుతోంది.ప్రాథమిక దర్యాప్తు ప్రకారం, విజయ రెడ్డి ఆత్మహత్యకు ప్రధాన కారణం తీవ్రమైన ఒంటరితనం . భర్త విదేశాల్లో ఉండటం, పిల్లలు హాస్టల్‌లో ఉండి చదువుకోవడం వల్ల ఆమె ఇంట్లో ఒంటరిగా గడపాల్సి వచ్చేది. తల్లి ఉన్నా ఆవిడ వయసు మీద పడడంతో ఒంటరిననే భావన ఉండిపోయింది. గోడల మధ్య మౌనం, పలకరించే మనుషులు లేకపోవడం ఆమెను డిప్రెషన్‌లోకి నెట్టి ఉండొచ్చని నిపుణులు భావిస్తున్నారు. "అన్నీ ఉన్నా.. ఎవరూ లేరు" అనే భావన మనిషిని మానసికంగా కృంగదీస్తుంది. అది చివరకు ప్రాణాలు తీసుకునేంత తీవ్రమైన నిర్ణయానికి దారితీసింది.ఈ కేసులో అందరినీ కలిచివేస్తున్న అంశం.. ఇంటర్మీడియట్ చదువుతున్న ఇద్దరు పిల్లల మరణం. యుక్తవయసులో ఉన్న పిల్లలు తల్లి నిర్ణయాన్ని ఎందుకు అడ్డుకోలేకపోయారు? తల్లిపై ఉన్న అమితమైన ప్రేమా? లేక తల్లి మానసిక స్థితిని చూసి వారు కూడా భయపడ్డారా?హాస్టల్ నుండి వచ్చిన పిల్లలు తల్లి వేదనను గుర్తించలేకపోయారా? లేక తల్లి తన బాధను వారి ముందు కూడా దాచిపెట్టిందా?సాధారణంగా తల్లులు తమ పిల్లల భవిష్యత్తు కోసం ఎన్ని కష్టాలనైనా ఓర్చుకుంటారు. కానీ,ఇక్కడ తల్లి తనతో పాటు పిల్లలను కూడా తీసుకెళ్లాలని నిర్ణయించుకోవడం వెనుక "నేను లేకపోతే నా పిల్లలు అనాథలవుతారు, వారిని ఎవరు చూసుకుంటారు?" అనే అభద్రతా భావం ఉండి ఉండవచ్చు.ఈ ఘటననేటి హై-ప్రొఫైల్ ఉద్యోగస్తుల జీవితాల్లోని చీకటి కోణాన్ని ఆవిష్కరిస్తోంది.

## వరల్డ్ కప్‌లో టీమిండియా ఇప్పటికంటే అప్పుడే 10 శాతం బెటర్‌గా ఉంది: అనీల్ కుంబ్లే



**హైదరాబాద్ పెన్ పవర్:** 2026 టీ20 వరల్డ్ కప్ కు మరో నాలుగు రోజుల సమయం మాత్రమే మిగిలింది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీలో తొలిసారి 20 జట్లు ఆడుతుండడంతో భారీ హైప్ నెలకొంది. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది. టోర్నీ ఇండియాలోనే జరుగుతుండడంతో డిఫెండింగ్ ఛాంపియన్ టీమిండియా టైటిల్ నిలబెట్టుకుంటుందని ఫ్యాన్స్ ఎంతో ఆతృత్తగా ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం జట్టు అత్యంత పటిష్టంగా ఉండడంతో పాటు గత రెండేళ్లలో తిరుగులేని విజయాలు సాధిస్తూ ముందుకు వెళ్తుంది. సొంతగడ్డపై ఆడుతుండడంతో ఇండియాపై అంచనాలు పెరిగిపోయాయి. 2024లో టీ20 వరల్డ్ కప్ గెలుచుకున్న తర్వాత భారత జట్టు ఒక్క సిరీస్ కూడా ఓడిపోలేదు. ప్రత్యర్థి ఎవరైనా.. వేదిక ఏదైనా..వరుసగా సిరీస్ విజయాలు సాధించింది. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలోని భారత జట్టు సొంతగడ్డపై టైటిల్ నిలబెట్టుకుంటుందని ఎక్స్ పర్ట్స్ అంచనా వేస్తున్నారు. అభిషేక్ శర్మ, ఇషాన్ కిషాన్ విధ్వంసానికి మారు పేరులా మారారు. సూర్య తన టాప్ ఫామ్ అందుకోవడం టీమిండియాకు కొండంత బలం. మిడిల్ ఆర్డర్ లో దుమ్ములేపడానికి ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్య, శివమ్ దూబే, రింకూ సింగ్ సిద్ధంగా ఉన్నారు. బౌలింగ్ లో కూడా డీసెంట్ గా కనిపిస్తుంది.

చాశ్రీంశీ =ఘుం : ఆ ఇద్దరు బౌలర్లను ఎదర్కోవడం కష్టంగా అనిపించేది వరల్డ్ బెస్ట్ టీ20 బౌలర్స్ జస్ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్ లతో పాటు స్పిన్నర్లు వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్ రూపంలో జట్టు పటిష్టంగా కనిపిస్తుంది. అయితే టీమిండియా దిగ్గజ క్రికెటర్ అనీల్ కుంబ్లే మాత్రం 2024లో వరల్డ్ కప్ గెలిచిన భారత జట్టు బెటర్ గా ఉందని సూచించాడు. కుంబ్లే మాట్లాడుతూ " అనుభవం గురించి మాట్లాడితే ఇండియా ఇద్దరు దిగ్గజాలు విరాట్, రోహిత్‌లను మిస్ అవుతున్నారు. బ్యాలన్స్ గురించి మాట్లాడితే ఇప్పటి జట్టు కూడా బాగుంది. ఎందుకంటే బౌలింగ్ ఆప్షన్స్ ఎక్కువగా ఉన్నాయి. బ్యాటింగ్ డెప్త్ కూడా ఎక్కువగా ఉంది. అయితే ఇప్పటి జట్టు సవాలుతో కూడుకున్నది. పరిస్థితుల పరంగా 2024 చాలా భిన్నంగా ఉంది. నేను బహుశా 2024 జట్టును ఈ జట్టు కంటే 10 శాతం బెటర్ గా ఉందని భావిస్తున్నాను". అని కుంబ్లే చెప్పుకొచ్చాడు.

## కిషాన్‌కు నో ఛాన్స్.. వరల్డ్ కప్ తొలి మ్యాచ్‌లో టీమిండియా ప్లేయింగ్ 11 ప్రకటించిన చాహల్





**హైదరాబాద్ పెన్ పవర్:** ఐసీసీ 2026 టీ20 వరల్డ్ కప్ కు నాలుగు రోజుల సమయం మాత్రమే ఉంది. ప్రస్తుతం అన్ని జట్లు వార్మప్ మ్యాచ్ లతో బిజీగా ఉన్నాయి. 2026 ఫిబ్రవరి 7న పాకిస్తాన్- నెదర్లాండ్ మధ్య జరగబోయే తొలి మ్యాచ్ తో ఈ మెగా టోర్నీ ప్రారంభం కానుంది. నెల రోజుల పాటు జరగనున్న ఈ టోర్నీ మార్చి 8న ముగుస్తుంది. షెడ్యూల్ ప్రకారం తొలి రోజే ఇండియా మ్యాచ్ ఆడనుంది. శనివారం (ఫిబ్రవరి 7) సాయంత్రం 7 గంటలకు యూఎస్ఏ తో మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్ లో టీమిండియా ప్లేయింగ్ 11 పై ఆసక్తి నెలకొంది. న్యూజిలాండ్ సిరీస్ తర్వాత ఎలాంటి జట్టుతో బరిలోకి దిగాలో టీమిండియా లెగ్ స్పిన్నర్ చాహల్ తన ప్లేయింగ్ 11 చెప్పుకొచ్చాడు. అభిషేక్ శర్మతో పాటు సంజు శాంసన్ ఇన్నింగ్స్ ఓపెనింగ్ చేయాలని చాహల్ సూచించాడు. బ్యాకప్ వికెట్ కీపర్ ఇషాన్ కిషాన్ కు తన జట్టులో స్థానం ఇవ్వలేదు. కిషాన్ ఇటీవలే న్యూజిలాండ్ తో జరిగిన 5 మ్యాచ్ ల టీ20 సిరీస్ అసాధారణంగా రాణించాడు. ఒక సెంచరీతో పాటు ఒక హాఫ్ సెంచరీ చేసి 200 పైగా స్ట్రైక్ రేట్ తో బ్యాటింగ్ చేసి సత్తా చాటాడు. అయినా చాహల్ కిషాన్ ను పక్కన పెట్టడం ఆశ్చర్యానికి గురి చేసింది. గాయం నుంచి కోలుకున్న తిలక్ వర్మ మూడో స్థానంలో ఎంపిక చేశాడు. నాలుగో స్థానంలో కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ ను ఎంచుకున్నాడు.ఐదో స్థానంలో ఫాస్ట్ బౌలింగ్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్య.. శివమ్ దూబే ఆరో స్థానంలో.. రింకూ సింగ్ ఏడో స్థానంలో.. అక్షర్ పటేల్ ను 8 వ స్థానాలకు ఎంపిక చేశాడు. ఫాస్ట్ బౌలర్లుగా జస్ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్ లకు తన ప్లేయింగ్ 11 లో చోటు కల్పించాడు. ఏకైక స్పిన్నర్ గా వరుణ్ చక్రవర్తిని తన తుది జట్టులో ఛాన్స్ ఇచ్చాడు. కుల్దీప్
యాదవ్ లాంటి నాణ్యమైన స్పిన్నర్ ఉన్నప్పటికీ చాహల్ మిస్టరీ స్పిన్నర్ వరుణ్ కు అవకాశం ఇచ్చాడు. ఫాస్ట్ బౌలర్ హర్షిత్ రానాకు తన ప్లేయింగ్ 11నుంచి పక్కన పెట్టాడు. ఓవరాల్ గా చాహల్ ప్రకటించిన ప్లేయింగ్ 11 నుంచి ఇషాన్ కిషాన్, హర్షిత్ రానా, ఇషాన్ కిషాన్ ను బెంచ్ కు పరిమితం చేశాడు.

**వరల్డ్ కప్ తొలి మ్యాచ్ కు చాహల్ టీమిండియా ప్లేయింగ్:**
అభిషేక్ శర్మ, సంజు సామ్సన్, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్య, శివం దుబే, రింకు సింగ్, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి, జస్ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్

## వరల్డ్ కప్ నుంచి ఔట్.. కమ్మిన్స్ ఐపీఎల్ ఆడతాడా..? సన్ రైజర్స్ కెప్టెన్ సమాధానమిదే



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియా స్టార్ ఫాస్ట్ బౌలర్ పాట్ కమ్మిన్స్ త్వరలో జరగబోయే 2026 టీ20 వరల్డ్ కప్ కు దూరమయ్యాడు. వెన్ను గాయం కారణంగా ఈ మెగా టోర్నీ నుంచి కమ్మిన్స్ వైదొలిగినట్లు క్రికెట్ ఆస్ట్రేలియా వెల్లడించింది. అతడి స్థానంలో బెన్ డ్వార్షుయిస్‌ను జట్టులోకి తీసుకున్నట్లు తెలిపింది. వరల్డ్ కప్ ముందు జరిగిన యాషెస్ సిరీస్ లోనూ కమ్మిన్స్ కేవలం ఒక టెస్ట్ మ్యాచ్ మాత్రమే ఆడగలిగాడు. 2025 జూన్ నెలలో వెస్టిండీస్ తో టెస్ట్ సిరీస్ లో గాయపడిన కమ్మిన్స్.. నాలుగు నెలలు క్రికెట్ కు దూరమయ్యాడు. ఓవరాల్ గా కమ్మిన్స్ చివరి 7 నెలల్లో ఒక్క యాషెస్ టెస్ట్ మాత్రమే ఆడాడు. ప్రస్తుతం వరల్డ్ కప్ నుంచి దూరమైన కమ్మిన్స్ గాయం నుంచి కోలుకుంటున్నాడు. ఇదిలా ఉంటే ఇప్పుడు కమ్మిన్స్ గాయం సన్ రైజర్స్ హైదరాబాద్ ఫ్యాన్స్ ను టెన్షన్ కు గురి చేస్తుంది. టీ20 వరల్డ్ కప్ ముగిసిన తర్వాత మరో రెండు వారాల్లో ఐపీఎల్ 2026 ప్రారంభం కానుంది. ఈ లోపు వెన్ను గాయం నుంచి కోలుకొని కమ్మిన్స్ ఐపీఎల్ ఆడతాడా అంటే చెప్పలేని పరిస్థితి. వరల్డ్ కప్ కు దూరమైన కమ్మిన్స్.. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూ లో తాను ఐపీఎల్ లో పాల్గొంటాడో లేదో ఒక క్లారిటీ ఇచ్చాడు. మార్చి 26న ప్రారంభమయ్యే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) సీజన్‌కు తాను ఫిట్‌గా ఉంటానని సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ పాట్ కమ్మిన్స్ ఆశాభావం వ్యక్తం చేశాడు.

కమ్మిన్స్ మాట్లాడుతూ.. " నేను ఐపీఎల్ ఆడేది లేనిదీ నా వెన్ను గాయంపై ఆధారపడి ఉంటుంది. కొన్ని వారాల్లో నాకు మళ్ళీ స్కాన్ జరుగుతుంది. స్కానింగ్ లో నాకు ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాను. టీ20 వరల్డ్ కప్ లో ఆడలేకపోవడం నిజంగా నా దురదృష్టకరం. నాకు చాలా చిన్న దెబ్బ తగిలింది. కొన్ని వారాల పటు రెస్ట్ తీసుకుంటే సరిపోతుంది. అడిలైడ్ టెస్ట్ మ్యాచ్ తర్వాత నేను గాయం నుంచి కోలుకోవడానికి నాలుగు నుండి ఎనిమిది వారాల మధ్య సమయం పడుతుందని భావించాను. కానీ ఫాలో-అప్ స్కాన్ చేయించుకున్న తర్వాత నాకు మరో రెండు వారాలు అవసరమైంది". అని కమ్మిన్స్ అన్నాడు.

## ధనుష్ పక్కన మరోసారి చాన్స్ కొట్టేసిన సాయి పల్లవి





స్టార్ హీరో ధనుష్ కథానాయకుడిగా, దర్శకుడు రాజ్‌కుమార్ పెరియస్వామి రూపొందిస్తున్న భారీ చిత్రంలో ప్రముఖ నటి సాయి పల్లవి హీరోయిన్‌గా ఎంపికైంది. సోమవారం చిత్ర నిర్మాణ సంస్థ వండర్‌బార్ ఫిల్మ్ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. గతంలో బాలాజీ మోహన్ దర్శకత్వంలో వచ్చిన 'మారి 2'లో ధనుష్, సాయి పల్లవి జోడీకి మంచి మార్కులు పడ్డాయి. ఇప్పుడు మళ్లీ ఈ హిట్ కాంబో రిపీట్ కానుండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ధనుష్ నిర్మాణ సంస్థ వండర్‌బార్ ఫిలింస్, ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న సంస్థల్లో ఒకటి. తమ ఎక్స్ (ట్విట్టర్) ఖాతా ద్వారా సాయి పల్లవికి స్వాగతం పలుకుతూ, "ఆమె అందం, శక్తి రెండింటి కలబోత. అందరి ఫేవరెట్ సాయి పల్లవికి ఛణ55 టీంలోకి స్వాగతం. హిట్ కాంబో మళ్లీ వెండితెరపైకి వస్తోంది" అని పోస్ట్ చేసింది.



గతంలో ధనుష్, సాయి పల్లవి కలిసి బాలాజీ మోహన్ దర్శకత్వంలో వచ్చిన 'మారి 2' చిత్రంలో నటించారు. ఈ సినిమాలో వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ, ముఖ్యంగా 'రౌడీ బేబీ' పాట ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీంతో ఈ హిట్ జోడీ మళ్లీ తెరపై సందడి చేయనుండటంతో సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరాయి. ఇదిలా ఉండగా, ఈ చిత్రంలో ఇప్పటికే మరో కథానాయికగా యువతరం క్రేజీ హీరోయిన్ శ్రీలీలను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. జనవరి 30న ఆమెను టీంలోకి ఆహ్వానిస్తూ మేకర్స్ ప్రకటన విడుదల చేశారు. దీంతో ఇద్దరు ప్రముఖ హీరోయిన్లు ఈ ప్రాజెక్టులో భాగం కావడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. వీరితో పాటు యువ సంగీత సంచలనం సాయి అభ్యంకర్‌ను ఈ చిత్రానికి సంగీత దర్శకుడి వ్యవహరిస్తున్నాడు. దీనిపై సాయి అభ్యంకర్ స్పందిస్తూ, ధనుష్‌తో పనిచేయడం ఒక కల అని, ఇది చాలా ప్రత్యేకమైన ప్రాజెక్ట్ అవుతుందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ చిత్రాన్ని ఒక భారీ దృశ్యకావ్యంగా (మాగ్నమ్ ఓపస్) నిర్మిస్తున్నట్లు మేకర్స్ ఇప్పటికే వెల్లడించారు. వండర్‌బార్ ఫిలింస్‌తో పాటు ఆర్ టేక్ స్టూడియోస్ కూడా ఈ సినిమా నిర్మాణంలో భాగస్వామిగా చేరినట్లు ఇటీవలే ప్రకటించారు. భారీ తారాగణం, ప్రముఖ నిర్మాణ సంస్థలు, ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులతో 'ఛ55' చిత్రంపై కోలీవుడ్‌లో తీవ్రమైన ఆసక్తి నెలకొంది.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D V RAO, FLAT NO: 402, VIGNESWARA PRANATHI REDDY TOWERS, OPP. BHARAT PETROLBUNK, VIDYANAGAR, TIRUPATI Dist.,editor GANTYADA APPARAO. PRGI Registration No. "APTEL/25/A4409" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965